₹40

మే – 2024

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 33 • సంచిక : 8

MAY - 2024




Editor : Er. VEDAKUMAR MANIKONDA

A PUBLICATION OF CHILDREN'S EDUCATIONAL ACADEMY, HYDERABAD, TELANGANA


# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**-మణికొండ వేదకుమార్**

చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**



**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక
BALA CHELIMI
Telugu Children's Monthly Magazine

సంపుటి: 33 సంచిక : 8 హైదరాబాద్ మే పేజీలు 52 రూ. 40
Volume: 33 Issue : 8 Hyderabad May Pages 52 ₹. 40

లోపలి పేజీల్లో.......








| | | |
|---|---|---|
| వేసవి సెలవులు... ఎన్జాయ్ చేయండి ............... | మణికొండ వేదకుమార్ ......... .................. | 5 |
| హెన్రీ డునాంట్-రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు . | సత్యప్రసన్న ........................................ | 6 |
| గర్వభంగం (కథ) ................................... | లియో టాల్‌స్టాయ్ ................................ | 7 |
| ముసలావిడ - సొరకాయ బుర్ర (కథ)............. | చౌదరి................................ ............ | 8 |
| మంచి మిత్రులు (కథ)............................... | డి.ఆదితిజ ........................................ | 11 |
| తల్లి ప్రేమ (కథ) .................................... | కె. కీర్తన ................. ...................... | 12 |
| పర్యావరణం ........................................... | చెట్టు - చేమ...................................... | 13 |
| నేను లోపలికి రావచ్చా? (నేర్చుకుందామా)......... | టి.వి.ఎస్. రమేశ్ ................................ | 14 |
| మూడు వేళ్లతో ముచ్చటగా కలాన్ని పట్టుకునే విధానం... | వై. మల్లికార్జున రావు ............................ | 15 |
| పుస్తకాల విలువ (కథ)............................... | జల్లా లావణ్య....................................... | 16 |
| బాలచెలిమి (గేయం)................................. | తుమ్మూరి రామ్మోహనరావు ....................... | 18 |
| వెనిస్ వర్తకుడు (కథ)............................... | విలియమ్ షేక్స్పియర్ .......................... | 19 |
| మరచిపోలేని మిత్రుడు (కథ) ........................ | ఇ. మనోజ్ సింహ ................................ | 21 |
| స్నేహం కోసం (అనువాద కథ)...................... | అనిల్ బత్తుల ....................................... | 23 |
| దిండూ - తుండూ (గేయం)......................... | గంగదేవు యాదయ్య .............................. | 24 |
| నిజమైన జోస్యం (కథ) ............................. | డా. పత్తిపాక మోహన్.............................. | 25 |
| సమ్మోహన రాగం .................................... | (కార్టూన్)........................................... | 26 |

అమ్మ (కథ)........................................ బొమ్మెల్ల లక్ష్మణ్ కుమార్........................ 28
త్వరగా వచ్చి గిల్లిపో (ఆటాడుకుందామా!)........... వై. యాదగిరి........................................ 29
ఆదిత్య కథ (కథ) ...................................... సయ్యద్ సలీం...................................... 30
రోదసిలో పుట్టిన తొలి ప్రాణి (పక్షి)...................... బాల చెలిమి ........................................ 31
మట్టి కుండను నేను! (గేయం)........................ గద్వాల సోమన్న .................................. 32
గుడ్డి కోతి (కథ)........................................ కె. శ్రీకాంత్‌నాయక్ .................................. 33
స్వర్ణ పుష్పాలు (కథ)................................... బి.పల్లవి ............................................ 35
మంథని దగ్గర మరో అజంతా (యాత్ర) ............ డా. ద్యావనపల్లి సత్యనారాయణ.................. 37
గ్లాసును లేవనెత్తిన మంట (సైన్స్) ...................... డాక్టర్ మహీధర నళినీ మోహన్.................. 38
చెలిమి క్లబ్................................................ ........................................................ 39
ఇంట్లో తోట : ఆరోగ్యాల పంట (కథ)................ యాడవరం చంద్రకాంత్ గౌడ్.................... 40
సమాచారం ................................................ ........................................................ 42
బాలసాహిత్యానికి పచ్చని తివాచీ బాలచెలిమి........ డా. ఉప్పల పద్మ...................................... 46
రవీంద్రనాథ్ ఠాగూర్ (వ్యక్తిత్వం) ..................... సువేగా ............................................... 49

## పబ్లిషర్స్ నోట్

చెలిమి అంటే స్నేహం. బడిలో చెలిమి.. ఇంట్లో కలిమి... బాల చెలిమి... చదువు కోడానికి పాఠ్య పుస్తకాలు మినహా ఇతర బాల సాహిత్యం అందుబాటులో లేని విద్యార్థుల్లో లోకజ్ఞానం పెంచి, రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడ ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారు చేసే లక్ష్యంతో ప్రారంభమైన బాలల వికాస పత్రిక 'బాలచెలిమి'. రెండు సంవత్సరములు (2018 నుండి 2020 సం॥) చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ప్రతి నెలా రెండవ శనివారం 'బాలచెలిమి' ముచ్చట్లు నిర్వహించింది. బాలసాహితీవేత్తలు, ఐ.టి. తదితర రంగాలకు చెందిన సాంకేతిక శాస్త్ర నిపుణులు, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, కళారంగాలకు చెందిన నిష్ణాతులు అనేక మంది తమ తమ అనుభవాలను పంచుకున్నారు. పిల్లల బహుముఖ అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో పిల్లల పెంపకంలో అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు బాల చెలిమి చక్కని ఉపకరణంగా ఉండాలనే ఆశయంతో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ఈ సంవత్సరం జనవరి నుండి బాల చెలిమిని మరింత ఆకర్షణీయ రంగులతో, విశేషాలతో మీ ముందుకు తెస్తున్నది. బాల బాలికలు, విద్యార్థినీ విద్యార్థుల, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు, బాలసాహితీ రచయితలు అందరూ 'బాలచెలిమి'ని ఆదరించి, తమ ప్రోత్సాహాన్ని అందించాలని కోరుతున్నాం.



*ముఖచిత్రం:*
నందిని గౌడ్
*బొమ్మలు:*
కూరెళ్ల శ్రీనివాస్
m : 98495 43728




**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# వేసవి సెలవులు... ఎన్జాయ్ చేయండి...

పరీక్షలు అయిపోయాయి. వేసవి సెలవులూ వచ్చేసాయ్. పిల్లలూ ఎన్జాయ్ చేయండి. ఎన్జాయ్‌తో పాటు సెలవుల కాలాన్నీ చక్కగ వాడుకోవాలి సుమా!

పల్లెటూరిలో ఉన్న అమ్మమ్మ, నాయనమ్మల ఇండ్లకో, దగ్గర చుట్టాల ఇంటికో వెళ్లండి. పల్లెటూరి ప్రకృతి అందాలను ఆస్వాదించండి. తాటి చెట్ల మీంచి తొంగిచూసే బంగారు సూర్యున్ని చూడండి. ముంగిట్లోనో, పెరట్లోనో విరబూసిన మందారాలను, గన్నేరు పూలనీ చూడండి. పక్కింటి పిల్లలతో కోతికొమ్మాట, బిళ్లంగోడు, బచ్చా, గోలీలాటలు ఆడండి. మీకొచ్చిన కథలు వాళ్లకు చెప్పండి. వాళ్లు చెప్పే ముచ్చట్లు వినండి. లేత లేత తాటి ముంజలు తినండి. సాయంత్రం పూట చెరువు గట్టుకు వెళ్లండి. పూలపై వాలే సీతాకోక చిలుకలతో మీరూ ఎగరండి. తూనీగల సంగీతమూ వినండి. ఒంటి కాలు మీద నిల్చొన్న కొంగల్నీ, అప్పుడే చెట్ల కొమ్మల మధ్యకు చేరుతున్న అందాల పక్షుల్ని, కిలాకిలారావాల్ని ఆనందించండి. పెద్దలు లేకుండా చెరువు నీళ్లలోకి దిగకండి. నాయిన్నమ్మ, అమ్మమ్మలు ప్రేమగా తినిపించే బచ్చాలు, సకినాలు, చక్కీలు తినండి. రాత్రి వేళ ఆరు బయట సన్నజాజి పందిరి పక్కన నాయిన్నమ్మ, అమ్మమ్మ ఒడిలో పడుకొని ఆకాశంలో మబ్బుల మధ్య పరుగెత్తే చందమామను చూస్తూ కథలు వినండి. కాలుష్యం లేని పల్లెటూరి పర్యావరణాన్ని ఆస్వాదించండి.



పల్లెటూరు వెళ్లలేని పిల్లలు దిగులు పడకండి. అమ్మా నాన్నలతో మన పక్కనున్న పార్కులకు వెళ్లండి. స్విమ్మింగ్, చిత్రలేఖనం, నృత్యం, క్రికెట్, యోగా క్లాస్‌లకు వెళ్లండి. మీలో ఉన్న సృజనాత్మక, క్రియాత్మక శక్తులకు మెరుగులు దిద్దండి. అలా అని ఎండలో తిరక్కండి. దగ్గరలో ఉన్న చారిత్రక ప్రదేశాలకు ఒకటి రెండు రోజులు పిక్నిక్‌లా వెళ్లిరండి.

వేసవి సెలవుల్ని ఎంజాయ్ చేయండి. ఈ వేసవి సెలవుల్లో మీ అనుభవాలను, ఆనందాలను కథలుగా, కవితలుగా, పాటలుగా రాసి బాల చెలిమికి పంపండి.

ఈ బాల చెలిమి మీ కోసమే...

వేదకుమార్.యం


(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



# హెన్రీ డునాంట్

## రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు




హెన్రీ డునాంట్ 8 మే 1828న జన్మించాడు. హెన్రీ డ్యూనాంట్ అని కూడా పిలుస్తారు, స్విస్ మానవతావాది, వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త మరియు రెడ్‌క్రాస్ సహ వ్యవస్థాపకుడు. అతని మానవతా ప్రయత్నాలకు 1901లో మొదటి నోబెల్ శాంతి బహుమతి లభించింది.

డునాంట్ జెనీవాలో భక్తుడైన కాల్వినిస్ట్ కుటుంబంలో జన్మించాడు మరియు ఫ్రెంచ్ అల్జీరియా మరియు ట్యునీషియాలో వ్యాపార ప్రయోజనాలను కలిగి ఉన్నాడు. 1859లో, నెపోలియన్ IIIని అభ్యర్థించడానికి వెళుతున్నప్పుడు, అతను ఉత్తర ఇటలీలోని సోల్ఫెరినో యుద్ధం యొక్క పరిణామాలను చూశాడు. క్షతగాత్రుల బాధలు మరియు వారికి లభించే సంరక్షణ లేకపోవడంతో భయభ్రాంతులకు గురైన డునాంట్ సైనికులకు సహాయం అందించడంలో స్థానిక జనాభాను నిర్వహించడానికి చొరవ తీసుకున్నాడు. జెనీవాకు తిరిగి వచ్చిన తరువాత, అతను తన అనుభవాలను 'ఎ మెమరీ ఆఫ్ సోల్ఫెరినో' పుస్తకంలో నమోదు చేశాడు, దీనిలో అతను యుద్ధ సమయాల్లో వివక్ష లేకుండా గాయపడిన వారికి ఉపశమనం కలిగించే సంస్థను ఏర్పాటు చేయాలని సూచించాడు. ఫిబ్రవరి 1863లో, డునాంట్ ఐదుగురు వ్యక్తుల కమిటీలో సభ్యుడు, అది తన ప్రణాళికను అమలులోకి తీసుకు రావడానికి ప్రయత్నించింది, ఇది అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీగా మారే సంస్థను స్థాపించింది. ఒక సంవత్సరం తరువాత, అతను స్విస్ ప్రభుత్వం నిర్వహించిన దౌత్య సదస్సులో పాల్గొన్నాడు, ఇది మొదటి జెనీవా కన్వెన్షన్ పై సంతకం చేయడానికి దారితీసింది.

అతను తరువాతి దశాబ్దాలు పేదరికం మరియు అస్పష్టతతో గడిపాడు, స్విస్ గ్రామమైన హైడెన్‌లో స్థిరపడటానికి ముందు యూరప్ అంతటా వివిధ ప్రదేశాలలో నివసించాడు. 1895లో, డ్యూనాంట్‌ను ఒక జర్నలిస్టు తిరిగి కనుగొన్నాడు, ఇది అతనికి కొత్త దృష్టిని మరియు మద్దతును తెచ్చిపెట్టింది మరియు 1901లో ఫ్రెంచ్ శాంతికాముకుడు ఫ్రెడెరిక్ పాస్సీతో కలిసి అతనికి మొదటి నోబెల్ శాంతి బహుమతి లభించింది. అతను 30 అక్టోబర్ 1910లో హైడెన్‌లో మరణించాడు.

– సత్యప్రసన్న



# గర్వభంగం

ఒక అడవిలో ఒక సింహం బాగా తిని చెట్టు కింద పడుకొంది. అటుగా వెళ్తున్న ఒక దోమ పడుకున్న సింహాన్ని చూసింది.

'అడవిలో జంతువులన్నీ సింహాన్ని రాజుగా గౌరవిస్తాయి కదా! ఈ సింహం గొప్ప ఏమిటి? ఇది నా కంటే గొప్పదా? దీని గొప్పతనమేమిటో చూస్తా?" అనుకొంటూ సింహం చుట్టూ 'జూయ్'మని శబ్దం చేస్తూ తిరిగింది. దోమ చేసిన శబ్దానికి సింహానికి మెలుకువ వచ్చింది. సింహం నిద్ర చెడిపోయినందుకు దోమ సంతోషిస్తూ సింహం ముందు వాలి –


"మృగరాజా! మృగరాజా!! అడవిలో నీవే బలమైన దానివని అందరూ అంటుంటారు కదా! నేను నీకంటే గొప్పదానిని తెలుసా?" అంది దోమ సగర్వంగా –

దోమ మాటలకు సింహానికి చాలా కోపం వచ్చింది. వెంటనే అది దోమను చంపబోయింది. కానీ దోమ తక్కున తప్పించుకుని పైకి ఎగిరి –

"చూశావా! నీవు నన్ను పట్టుకోలేకపోయావు" అంది నవ్వుతూ. సింహానికి కోపం మరీ ఎక్కువైంది. దోమ, సింహం చుట్టూ తిరుగుతూ సింహం ముక్కుపై వాలింది. సింహం తన పంజాతో ఒక్కటి కొట్టింది. దోమ 'జయ్'మంటూ గాలిలోకి ఎగిరింది. పంజా తన ముక్కుపైనే పడి రక్తం చిమ్మింది. ఈ విధంగా సింహం కన్నుపై, చెవులపై వాలుతూ సింహాన్ని బాధిస్తున్న దోమ హఠాత్తుగా పక్కన చెట్టుకి ఉన్న సాలె గూడులో చిక్కుకుపోయింది. సాలె పురుగు తన గూడులో చిక్కుకుపోయిన దోమను లటుక్కున మింగింది.

'అన్నింటికంటే నేనే గొప్పదానిననుకొని గర్వపడ్డాను. నాకంటే గొప్పవి కూడా ఉన్నాయని ఇప్పుడు తెలిసింది. నా గర్వమే నా చావుకు కారణమైంది" అనుకుంటూ దోమ ప్రాణం విడిచింది.

**(లియో టాల్‌స్టాయ్ కథ ఆధారంగా)**





# ముసలావిడ - సొరకాయ బుర్ర

చాలా కాలం క్రితం ఒక ఊళ్ళో ఒక ముసలావిడ ఉండేది. ఆమెకు పుట్టెడు గూని ఉండేది. ఆ ముసలావిడ రెండు కుక్కలను పెంచేది. వాటిని లింగు, లిటుకు అంటూ ముద్దుగా పిలిచేది. ఒకసారి ఆ ముసలావిడకి తన మనుమరాలిని చూడాలని అనిపించింది. మనుమరాలి ఊరికి వెళ్లాలంటే అడవి దాటి వెళ్లాలి.

'ముసలిదాన్ని, నన్నెవరేం పీక్కు తింటారు' అని బయలు దేరింది. వెళ్ళేముందు తన కుక్కలను పిలిచి "నేను లేనని ఊరు పట్టుకు తిరగకండి. ఇంటి పట్టునే ఉండండి' అని చెప్పింది. 'సరే' అంటూ లింగు, లిటుకు తలూపాయి.

ముసలావిడ బయలుదేరింది. కర్రపోటు వేసుకొంటూ అడవి దారిలో నడవ సాగింది. నాలుగు అడుగులు వేసిందో లేదో ఎక్కడ నుంచో వచ్చి ఒక నక్క ఆమెకు అడ్డంగా నించుంది. నక్కను చూసి ముసలావిడ ఒక బోసి నవ్వు నవ్వింది.

'పది రోజుల నుంచీ ఆకలితో నకనకలాడి పోతున్నాను. దేవుడు పంపినట్లు వచ్చావు. నిన్ను తినేసి మూడు రోజులపాటు హాయిగా నిద్దరపోతాను' అంది నక్క.

ముసలావిడకి కాళ్ళలో వణుకు పుట్టింది. తెలివి గల ఘటం కాబట్టి వెంటనే సర్దుకుంది. నన్ను సరిగ్గా చూడు, నా వంట్లో చటాకు మాంసం లేదు. గిద్దెడు నెత్తురు లేదు. నన్ను తింటే నీ ఆకలి తీరదు. నాలుగు రోజులు ఓపిక పట్టు. నా మనుమరాలి ఇంటికి వెళ్ళి బాగా తిని బలిసి వస్తాను. నా కోసం ఇక్కడే కనిపెట్టుకొని ఉండు. అప్పుడు నన్ను తిందువు గాని' అంది.

నక్క కాసేపు ఆలోచించింది. చివరికి 'సరే, నీ మాట నమ్మి నిన్ను వదిలిపెడుతున్నాను. బాగా తిని బలిసి రావాలి' అంటూ చెట్లలోకి వెళ్ళి పోయింది.

'హమ్మయ్య. గండం గడిచింది' అనుకొంటూ ముసలావిడ ముందుకు పోసాగింది. కాస్త దూరం నడిచిందో లేదో, పెద్దగా గాండ్రిస్తూ ఒక పులి వచ్చింది. ముసలావిడని చూడగానే పులికి నోట్లో

నీళ్ళూరాయి. 'నరమాసం తిని నాలుగు నెలలయింది. నిన్ను వదలను. కమ్మగా భోం చేస్తాను' అంది పులి.

పులి మాటలు వినగానే ముసలావిడకి ప్రాణం పోయినంత పని అయింది. అయితే వెంటనే తేరుకొంది. 'చూడు పులిరాజా, ఎముకల పోగులాగ ఉన్న నన్ను తింటే నీకు రుచీ పచీ ఉండదు. నేను నా మనుమరాలింటికి వెడుతున్నాను. అక్కడ ముప్పొద్దులా సుష్టుగా తిని వంటికి కాస్త కొవ్వు పట్టించుకొని వస్తాను. అందాకా నా కోసం ఇక్కడే వేచి ఉండు. అప్పుడు నీకు నేను నోటికి హితవుగా ఉంటాను' అంది.

కళ్ళలో ప్రాణాలు పెట్టుకొన్న ఆ ముసలావిడని చూశాక, పులికి ఆవిడ మాటలు నచ్చాయి. 'సరే, ఇక్కడే నీ కోసం కాచుకొని ఉంటాను' అంటూ వెళ్ళిపోయింది.

'బ్రతుకు జీవుడా' అనుకొంటూ ముసలావిడ ముందుకు కదిలింది. కర్ర ఊతంతో మెల్లిమెల్లిగా నడుస్తూ అడవి చివరకి వచ్చేసింది. 'ఎలాగో అలాగ అడవి దాటినట్టే' అనుకొంటూ, ఆయాసం తీర్చు కోవడానికి కాసేపు ఒక చెట్టు క్రింద చతికిలపడింది.

చెట్టుమీంచి ఒక ఎలుగుబంటి ఆమె ముందుకి దూకింది. ముసలావిడని చూస్తూనే లొట్టలు వేసింది. "నిన్ను ఇప్పుడే తినేస్తాను" అంటూ ఆమె మీద పడ బోయింది.

'ఆగు! తొందరపడకు. నన్ను చూడు ఎలా ఎండి పోయి ఉన్నానో! నన్ను తింటే నీకు పళ్ల నొప్పులు తప్ప ఆకలి తీరదు. కాస్త ఓపిక పట్టు. అదిగో ఆ కనిపించేదే నా మనుమరాలి ఊరు. నేను అక్కడికే వెడుతున్నాను. అక్కడ నాలుగు రోజులపాటు బాగా తిని రుబ్బురోలులా తయారయి వస్తాను. అప్పుడు నన్ను తిందువు గాని' అంది ముసలావిడ.

ఎలుగుబంటి కాసేపు బుర్ర గోక్కుంటూ ఆలోచించింది. తరవాత ముసలావిడ కళ్ళలోకి చూస్తూ 'సరే అలాగే కానీ, నీ కోసం ఎదురుచూస్తూ ఈ చెట్టు మీదే ఉంటాను. నువ్వు మటుకు బాగా తిని బలిసి రావాలి' అంది.

'తప్పకుండా వస్తాను' అంటూ ముసలావిడ అడవి దాటింది. మనుమరాలి ఇంటికి వెళ్లింది. అక్కడ రోజూ మిఠాయిలు, పెరుగు, నెయ్యి విసుగు విరామం లేకుండా తింది. దాంతో ఆవిడ బాగా లావయింది. ఇంకా తింటూ కూచుంటే ఫట్‌మని పేలి పోతానేమో నని ముసలావిడకి భయం పట్టుకొంది. అందుకే 'ఇహ నేను మా ఊరు పోతాను. ఇంత లావు శరీరాన్ని మోసుకొంటూ నడవలేను. దొర్లుకొంటూ పోతాను. అయితే తోవలో నా కోసం ఎలుగుబంటి, పులి, నక్క ఆవురావురు మంటూ ఎదురు చూస్తున్నాయి. "ఏదో ఒకదాని నోట్లో పడి చావక తప్పదు" అంటూ ముసలావిడ కళ్ల నీళ్లు పెట్టుకొంది.

"నువ్వు బెంగ పెట్టుకోకు. నిన్ను మీ ఊరు క్షేమంగా చేర్చే పూచి నాది" అంది మనుమరాలు. తరవాత ఆ అమ్మాయి అడవి లోంచి ఒక రాక్షసి సొరకాయ బుర్రను తెప్పించింది. ముసలావిడను దాంట్లో పడుకోమంది. ఆవిడ కిందా మీదా పడి ఎలాగయితేనేం, ఆ సొరకాయ బుర్రలో ఇరికింది. తోవలో తినడానికి ఇన్ని ద్రాక్షపళ్లు ఆ సొరకాయ బుర్రలో పెట్టింది మనుమరాలు. తరవాత దాని మూతి మందపాటి బట్టతో మూసేసింది. ఆ బుర్రను అడవి అంచుకు దొర్లించుకుంటూ వెళ్ళింది. అక్కడ దాన్ని గట్టిగా ఒక తాపు తన్నింది. వెంటనే ఆ బుర్ర గునగున దొర్లుకొంటూ అడవి తోవలో పోసాగింది.

దొర్లూ దొర్లూ సొరకాయ బుర్రా
తోవంత నీదే సొరకాయ బుర్రా
ద్రాక్షలు తింటా సొరకాయ బుర్రా
గింజలు ఊస్తా సొరకాయ బుర్రా
ఇంటికి చేరేను ముసల్దీ
బాగా బలిసిన ముసల్దీ–

అని పాడుకొంటూ ఆ ముసలావిడ సొరకాయ



చూసింది. ఎక్కడా కనిపించలేదు. 'ఆ ముసల్ది ఈ సొరకాయ బుర్రలోనే దాక్కొని ఉంటుంది. ప్రపంచం లోని జిత్తులన్నీ తెలిసిన నాకే టోకరా ఇద్దామను కొంటోంది" అనుకొంటూ ఆ సొరకాయ బుర్రను గోళ్ళతో గీకి, పళ్లతో పీకి పగలగొట్టింది. దాంతో ఆ బుర్రలో ఉన్న ముసలావిడకి బయటకు రాక తప్పలేదు.

బుర్రలో దొర్లుకొంటూ పోసాగింది. కొంత దూరం పోగానే ముసలావిడ కోసం ఆబగా ఎదురుచూస్తున్న ఎలుగుబంటి ఎదురయింది. దానికి ముసలావిడ కనిపించ లేదు. కానీ దొర్లుకుంటూ పోతున్న సొరకాయ బుర్ర కనిపించింది. సొరకాయ బుర్రను ఆపి అటూ ఇటూ దొర్లించింది. ఏమీ కనిపించలేదు. ముసలావిడ పాట మటుకు వినిపించింది. బాగా బలిసిన ముసల్ది ఇంటికి పోయిందని వినిపించగానే ఎలుగుబంటికి ఎక్కడ లేని కోపం వచ్చింది. ఆ కోపంతో సొరకాయ బుర్రను సాచి ఒక్క తన్ను తన్నింది. వెంటనే సొరకాయ బుర్ర దొర్లుకుంటూ ముందుకు పోయింది.

అలా సొరకాయ బుర్ర దొర్లుకుంటూ పోతూనే ఉంది. ఇంతలో హఠాత్తుగా పులి వచ్చి సొరకాయ బుర్రకు ఎదురుగా నించుని దాన్ని ఆపింది. పులికి పాట వినిపిస్తోంది. కానీ మనిషి కనిపించటం లేదు. ముసల్ది ఇంటికి చేరింది అని వినగానే కోపంతో గట్టిగా గాండ్రించింది. 'ఈ పనికి రాని సొరకాయ బుర్ర నాకెందుకు' అని దాన్ని బలంగా ఒక్క తన్ను తన్నింది. సొరకాయ బుర్ర వేగంగా దొర్లుకుంటూ ముందుకు పోయింది.

'ఇహ ఊరు దగ్గరపడ్డట్టే' అని హాయిగా నిట్టూర్చింది ముసలావిడ. ఇంతలో నక్క వచ్చి సొరకాయ బుర్రకు ఎదురుగా నించుంది. పాటను అది శ్రద్ధగా వింది. మనిషి కోసం అటూ ఇటూ

'బలే బలిశావు. నిన్ను చూస్తుంటే నోరు ఊరి పోతోంది. ఇహనా కన్ను కప్పి పారిపోలేవు. నిన్నిప్పుడే తింటాను' అంటూ ముసలావిడ మీద పడింది.

ముసలావిడ ప్రాణం మీద ఆశ వదులుకుంది. ఎలాగో తంటాలు పడి గొంతు పెగుల్చుకొని నక్కతో ఇలా అంది – 'నన్ను నువ్వు నిక్షేపంగా తినవచ్చు. అసలు నేను అందుకేగా వచ్చింది. అయితే ఒక్క మనవి. చచ్చే ముందు దైవ ప్రార్థన చేసుకొని చచ్చిపోవడం మా ఆచారం. ఒక్కసారి నా ఇష్టదైవాన్ని ప్రార్థించుకుంటాను"

'సరే, ఏ దేవుణ్ణి తలుచుకుంటావో నీ యిష్టం. అదేదో తొందరగా కానీ" అంది నక్క.


ముసలావిడ నక్కకు కొంచెం దూరంగా వెళ్లింది. కళ్ళు మూసుకుంది.

"లింగూ, లిటుకూ రారండీ
మీ అమ్మను తీసుకుపోరండి"

అంటూ గట్టిగా పాడింది. ఆ పాట లింగు, లిటుకులకు వినిపించింది. అవి భీకరంగా అరుస్తూ క్షణాల మీద ముసలావిడ దగ్గరకు వచ్చాయి. వాటిని చూస్తూనే నక్క హడిలిపోయింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయింది. ముసలావిడ లింగు, లిటుకులను ప్రేమగా దువ్వింది.

– రాయచౌదరి

# మంచి మిత్రులు



సీతాపురంలో క్రాంతివర్మ వజ్రాల వ్యాపారి. సీతాపురానికి, రామాపురానికి మధ్య ఓ చిట్టడవుంది. ఆ అడవిలో ఉండే కొంగ, కోతి మంచి మిత్రులు. ఒకరోజు కొంగ ఎండవేడికి తట్టుకోలేక కిందపడిపోయింది. ఆ దారిలో వెళ్తున్న క్రాంతివర్మ కొంగను చూశాడు. వెంటనే తన వద్ద ఉన్న నీటిని తాగించాడు. కాసేపటికి కొంగ కళ్ళు తెరిచింది. నెమ్మదిగా లేచి ఎగిరిపోయింది. కొద్ది రోజులకు ఒక దొంగ క్రాంతివర్మ ఇంటి నుంచి వజ్రాల హారాన్ని దొంగిలించాడు. దాన్ని అడవిలో గొయ్యి తీసి దాచిపెట్టాడు. ఇదంతా కొంగ గమనించి కోతికి చెప్పింది. కోతి గోతిని తవ్వి హారాన్ని కొంగకిచ్చింది. కొంగ హారాన్ని క్రాంతివర్మకి అప్పగించింది. తను చేసిన చిన్నపాటి సాయానికి కొంగ తిరిగి సాయం చేసిన తీరు చూసి క్రాంతివర్మ ఆశ్చర్యపోయాడు.

– డి.ఆదితిజ

4వ తరగతి, ఎస్.ఆర్.డి.జి. స్కూల్, ఖమ్మం.

# తల్లి ప్రేమ



అనగనగా హిందోళ అనే రాజ్యం ఉండేది. ఆ రాజ్యం యొక్క రాజు పేరు వీరరాజు. అతని భార్య పేరు లక్ష్మీదేవి. ఆ రాజుకి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. పెద్ద కుమారుడికి విద్యపట్ల ఎక్కువ శ్రద్ధ లేదు. పెద్దల మాటకు విలువ ఇచ్చేవాడు కాదు. పెద్దలను గౌరవించేవాడుకాదు. వయసు వచ్చిన తర్వాత పెద్ద రాజకుమారుడు రాజ్యాన్ని వదిలి దూరంగా వెళ్ళిపోయాడు.

చిన్న రాజకుమారుడుకి కూడా విద్యపై శ్రద్ధ అంతంత మాత్రమే ఉంది. వయసు వచ్చిన కొన్ని సంవత్సరాల తర్వాత అతనికి కూడా పెళ్లి జరిగింది. అందరు వచ్చి తనని ఆశీర్వదించినారు. అయినా, అతని జీవితం సరిగ్గా ఉండేది కాదు. అనవసరమైన విషయాలకు కూడా గొడవపడేవారు. వీరికి కొన్ని సంవత్సరాలకు ఒక కుమార్తె జన్మించింది.

చాలా సంవత్సరాల తర్వాత చిన్న రాజ కుమారుడి భార్య అనారోగ్యంతో చనిపోయింది.


కొన్ని సంవత్సరాల తర్వాత అతడు మరొక రాజ్యం యొక్క కుమార్తెని పెళ్లి చేసుకొంటాడు. ఆమె, అతని మొదటి భార్య పిల్లల పట్ల ఎంతో క్రూరంగా ప్రవర్తించేది. ఆ రాజకుమారుడు మొదటి భార్య పిల్లలకు రాజ్యం, ఖజానాలో ధనం, అన్నింటిలో సగం భాగం రావాలి. కానీ తన రెండో భార్య తన పిల్లలకోసం వాడుతుంది. మొదటి భార్య కుమార్తెకు రావాల్సిన భాగాన్ని తన పిల్లలకు వచ్చేలా చేసింది. మొదటి భార్య కుమార్తెని పని వాళ్ళ కన్నా హీనంగా చూసేది, హింసించేది. ఆ బాధలను భరించలేక ఆమె, తమ రాజ్యం వదిలి వెళ్లిపోగా, ఇతర రాజ్యాల వారు చేరదీసి, ఆమెకి విద్యాబుద్ధులు నేర్పి, ప్రయోజకులుగా తీర్చిదిద్ది యువరాణి స్థానాన్ని కల్పిస్తారు. ఆ అమ్మాయి తనని చేరదీసిన వారిని అమ్మానాన్నలుగా భావించింది.

యువరాణికి యుక్తవయస్సు రాగా, కుంతల దేశ యువరాజుతో వివాహం నిశ్చమైంది.

వివాహానికి అన్ని దేశాల వారు రాగా, హిందోళ దేశము నుండి తమ తల్లిదండ్రులు రాగా, వివాహ సమయంలో ఒక సందర్భంలో తన అమ్మానాన్నలు, వారి పేర్లు తెల్పగా, సభలో అందరూ ముక్కున వేలేసుకున్నారు. సవతితల్లైనా తల్లేకదా! నన్ను పెంచింది వీరని చూపుతుంది. ఆ సభలో సవతి తల్లి మానసికంగా కృంగిపోయి, తనతప్పు తనకు తెలియవచ్చిందని కూతురుపై పడి విలపిస్తుంది.

– కె. కీర్తన
9వ తరగతి, తేజస్వి ఉన్నత పాఠశాల, హనుమకొండ

# పర్యావరణం



మనం నివసించే ప్రదేశంలో చుట్టూ ఉండే పరిసరాలు, అందులో ఉండే మౌలిక విషయాలనే పర్యావరణం అంటారు. మనం నివసించే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మన కనీస బాధ్యత. పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలంటే ఇంధనం వాడకాన్ని తగ్గించాలి. కాలుష్యాన్ని కలిగించే వస్తువుల వాడకం తగ్గించాలి. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. ప్లాస్టిక్ భూమిలో కలవాలంటే కొన్ని వేల సంవత్సరాలు పడుతుంది. మనం వదిలే కలుషిత గాలి వల్ల కూడా ఎంతో కాలుష్యం జరుగుతుంది. ఇదంతా కలగకుండా ఉండాలంటే చెట్లను పెంచాలి. మనం పీల్చే గాలి చెట్ల నుండి వస్తుంది. అదే ప్రాణ వాయువు. మనం చేసే పనుల వల్ల కాలుష్యం ఎంతో జరుగుతుంది. దీనివల్ల రోజుకు కొన్ని వందల జీవరాశులు అంతరించిపోతున్నాయి. కారణం భూమి వేడెక్కడం, అది కూడా మనం చేసే పనుల వల్లనే అనే విషయం మానవులు గుర్తు పెట్టుకోవాలి. కాలుష్యాన్ని నివారించాలంటే ప్రతి ఒక్కరూ వారి ఇళ్లలో విధిగా చెట్లను పెంచాలి. ఇంట్లో ఉండే చెత్తను కాల్చవద్దు. చెత్త కుండిలో పడేయాలి. రోడ్డు పక్కన పెట్టిన కుండీలనే ఉపయోగించాలి. మానవాళికి పర్యావరణం పెనుముప్పుగా పరిణమించకుండా ఉండాలంటే విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యాయులు, సమస్త ప్రజలు మేల్కోవాలి.

– బాలచెలిమి న్యూస్

# నేను లోపలికి రావచ్చా?

**ఎందుకు :** అభినయం కోసం

**ఎలా చేయాలి :** 6 మంది పిల్లల్ని ఎత్తుల వారీగా నిలబెట్టాలి. వీళ్లలో చిన్నవారు చీమ, తరువాతి వారు కప్ప, తరువాతి అమ్మాయి కాకి, తర్వాత అమ్మాయి కుందేలు, తరువాతి వాడు మేక, తరువాత వాడు ఏనుగు. మిగిలిన పిల్లల్ని గుండ్రంగా కూర్చోబెట్టాలి. కొంచెం దారి వదలాలి. ఇది కుండ ఇల్లు అన్నమాట. మొదట చీమ ఇంటి చుట్టూ తిరిగి "ఎవరండీ లోపల" అంటూ లోనికి వెళుతుంది. తరువాత కప్ప బెకబెక మంటూ ఇంటి చుట్టూ తిరిగి ఎవరండీ లోపల అంటుంది.




"నేనూ చీమని" అని చెప్పాలి చీమ


"లోపలకు రావచ్చా" అడుగుతుంది కప్ప.

"రా" అంటుంది చీమ. ఆ తరువాత కాకి ఎగురుతూ కావ్‌కావ్ అంటూ కుండ చుట్టూ తిరిగి ఎవరండీ లోపల అంటుంది. నేను చీమని, నేను కప్పని అని వరుసగా చెపుతాయి. నేనూ లోపలికి రావచ్చా అని అడుగుతుంది కాకి. రెండూ కలిసి రమ్మంటాయి. కాకి లోపలికి వెళుతుంది. ఇలా కుందేలు, మేక వెళ్లిన తరవాత చివరగా ఏనుగు లోపలికి రావచ్చా అని అడుగుతుంది. రమ్మంటాయి. ఏనుగు వెళుతుంది. కుండ పగిలిపోయినట్లు పిల్లలు వెనక్కిపడిపోతారు.

**చర్చ :** ఒంటెను ఎక్కడైనా చూశావా? ఏనుగును చూశావా? వీటిలో నీకు ఏది ఇష్టం? ఎందుకు?

– టి.వి.ఎస్. రమేశ్





కథ, కార్టూన్ : వడ్డేపల్లి వెంకటేశ్, m : 9989596554

అక్షరం

# మూడు వేళ్లతో ముచ్చటగా కలాన్ని పట్టుకునే విధానం






అక్షరం ఆచంద్రతారార్కం. 'క్షరము' అంటే నశించిపోయేది; 'అక్షరం' అంటే ఎప్పటికీ నిలిచి ఉండేది, నాశనం లేనిది అని అర్థం. మనం పుట్టకముందే ఎన్నో తరాల వారికి విజయాన్ని చవి చూపించి, మనం గతించిన తర్వాత కూడా తరువాతి తరాలకు మార్గ నిర్దేశం చేసే అక్షరాన్ని అస్పష్టంగా రాసి చులకన చేసే అధికారం ఎవరికీ లేదు. విశ్వవ్యాప్తమైన విజ్ఞానాన్ని అక్షరం మనిషి నుంచి మనసుకు మోసుకెళ్తుంది.

భాషకు సంబంధించి.. వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం అనే నాలుగు నైపుణ్యాలలో చివరిదైన 'రాయడం'.. మనలోని భావాన్ని యధాతథంగా మరొకరికి వ్యక్తపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. "రాయడం" అనేది ఒక సబ్జెక్టు కాదు; అదొక నైపుణ్యం. మాట్లాడడం, భోజనం చేయడం, సైకిల్ తొక్కడం లాంటిదే. ఎవరికైనా ఇట్టే అబ్బుతుంది. కావాల్సిందల్లా మూడే విషయాలు: మెలకువలు, ఆసక్తి మరియు అభ్యాసం. అంతే.

ఈ మూడింటిలో ఒక్కటంటే ఒక్క విషయంలో కూడా రాజీ పడకుండా పాటిస్తే ఎవరైనా అందమైన చేతిరాతను సొంతం చేసుకోవచ్చు. మాతృభాషలో ఒక్క అక్షర దోషం కూడా లేకుండా స్పష్టంగా రాయగలగడం ప్రతిఒక్కరి కనీస బాధ్యత. ఏ భాషలోనైనా అందమైన దస్తూరి అలవరచుకోవడానికి అక్షరాల్ని అభ్యసించడం కన్నా ముందే కలం, కాగితం పట్టుకునే విధానం, అక్షరాలకు ఆధారమైన గీతలను అవపాసన పట్టడం చాలా ముఖ్యం.

బొటన వేలు, చూపుడు వేలు మరియు మధ్య వేలు మాత్రమే ఉపయోగించి పెన్సిల్ లేదా పెన్‌ని పట్టుకోవాలి. కలం క్రింది భాగంలో మధ్య వేలు ఉండేలా చూసుకుంటూ బొటన వేలు, చూపుడు వేలు కలానికి కుడి – ఎడమల వైపు ఉండేలా పట్టుకోవాలి. (కుడి చేతి వాటం వారు బొటన వేలు ఎడమ వైపు, చూపుడు వేలు కుడివైపు.... ఎడమ చేతి వాటం వారు వాటి వ్యతిరేక దిశల్లో ఉండేలా చూసుకోవాలి) పెన్సిల్/ పెన్ యొక్క టిప్ భాగం నుండి ఒక అంగుళం దూరం వదిలి పట్టుకోవాలి.




కలాన్ని మూడు వేళ్లతో ఎంత బలంగా పట్టుకుంటే అంత ఎక్కువ ఒత్తిడి కాగితం మీద పడుతుంది కాబట్టి కలాన్ని కాస్త వదులుగా పట్టుకోవాలి. కుడిచేత్తో రాసేవారు కాగితాన్ని ఎడమ వైపుకు వంచి రాయాలి. సర్వే జనా లిఖినోభవంతు.

– వై. మల్లికార్జున రావు,
డైరెక్టర్, మహా అకాడెమి
m : 98490 08122

# పుస్తకాల విలువ




భాగ్యలక్ష్మి ఒక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుచున్న విద్యార్థిని. మామూలుగా చదువుతుంది. అయినా తన ఉపాధ్యాయులు మాత్రం "భాగ్యలక్ష్మి నువ్వు పట్టుదలగా చదివితే తరగతిలోనే మొదటి శ్రేణిలో ఉంటావు" అనేవారు. కాని ఆమెకు చదువు మీద ఆసక్తి ఉండేది కాదు.

"మనుషులు కొంతమంది చిన్న చిన్న వాటికే ఆకర్షింపబడతారు, అది వస్తువే కావచ్చు, ఆహారమే కావచ్చు". ఈ మాట ఎందుకు అనవలసి వచ్చిందంటే భాగ్యలక్ష్మి తిండిబోతు. ఎప్పుడు ఏదో ఒకటి తింటూనే ఉంటుంది. బడికి వెళ్ళేటప్పుడు అమ్మ దగ్గర గారాబం చేసి ఎంతో కొంత వసూలు చేసుకొని, ఏదో ఒకటి కొనుక్కొని తింటూనే ఉంటుంది. వాళ్ళమ్మ మంజుల అప్పుడప్పుడు "దీనికి తిండిగోల తప్ప చదివే ధ్యాసే లేదు" అంటుంది.

భాగ్యలక్ష్మి ఆటోలో పాఠశాలకు వెళ్ళి వచ్చేది. అయితే ఒకరోజు ఆటోలో బడికి వెళ్తుంటే నాలుగు గిర్రల బండిమీద పీచుమిఠాయి అమ్ముతూ కనిపించింది. దాన్ని చూడగానే భాగ్యలక్ష్మికి తినాలనిపించింది. కాని స్కూల్ టైం అయింది. ఆటో ఆపమంటే కోప్పడతాడు. అందుకే ఆగకుండా ముందుకు వెళ్ళింది. అమ్మ దగ్గర తెచ్చుకున్న పైసలు పెట్టి బడి దగ్గరేకొని తిన్నది. మళ్ళీ వచ్చేటప్పుడు అక్కడే పీచుమిఠాయి బండి కనిపించింది. కాని డబ్బులు లేవు. ఎలాగో నిగ్రహించుకొని "రేపుకొందాంలే" అనుకుంటూ వెళ్ళింది.

ఆ రోజు సాయంత్రం వారి అమ్మానాన్నలు బజారుకెళ్ళారు. భాగ్యలక్ష్మి ఒక్కతే ఇంట్లో ఉంది. అదే సమయంలో "పాతపుస్తకాలకు, పాత పేపర్లకు పీచుమిఠాయి, పీచుమిఠాయి" అంటూ నాలుగు గిర్రల మీద అమ్ముతూ వాళ్ళ ఇంటిముందుకు వస్తున్నాడు. ఆమాట వినగానే భాగ్యలక్ష్మి కోరిక దిగ్గునలేచి ఎగిరినాట్యం చేసింది. వెంటనే పాతపుస్తకాల కోసం, పేపర్ల కోసం వెతికింది. ఎక్కడా ఒక్క పాతపుస్తకంగాని, పేపరుగాని కనిపించలేదు. తనకు తెలియని విషయం ఏంటంటే, ఆరోజు

ఉదయమే వాళ్ళమ్మ పాతపుస్తకాలు, పేపర్లు వేసి ఉల్లిగడ్డలు కొన్నది. అందుకే ఇంట్లో ఏం లేవు. బండి ముందుకు కదిలింది. తినాలనే కోరిక కాలు నిలవనీయడంలేదు. అప్పుడు తనకండ్లు తన పుస్తకాల సంచి మీదకు వెళ్ళాయి. క్షణం ఆలస్యం చేయకుండా వెళ్ళి ఆ పుస్తకాలు ఇచ్చి పీచుమిఠాయి కొన్నది. కొద్ది

కొద్దిగా తింటూ ఆనందించింది.

మరుసటిరోజు పాఠశాలకు వెళ్ళింది. టీచర్ తెలుగుపాఠం చెప్పారు. ఒక్కొక్కరిచే చదివిస్తున్నారు. భాగ్యలక్ష్మి వంతు వచ్చాక తను పక్కనున్న స్నేహితురాలి పుస్తకం అడిగి తీసుకొని చదివింది. అప్పుడు టీచర్ 'నీపుస్తకం ఏమయింది భాగ్యలక్ష్మి' అన్నారు.

'ఇంటిదగ్గర మర్చిపోయాను టీచర్' అంది భాగ్యలక్ష్మి. అలా కొన్ని రోజులు ఎవరికీ తెలియకుండా ఎలాగోలా నెట్టుకొచ్చింది. యూనిట్ పరీక్షలు దగ్గరకు వచ్చాయి. పుస్తకాలు లేవు. స్నేహితుల్ని అడిగితే మేము చదువుకోవాలి అంటున్నారు. ఎలా? ఎలా?

ఒకరోజు టీచర్‌కు అనుమానం వచ్చి పుస్తకాల సంచి చూశారు. అసలు ఒక్క పాఠ్యపుస్తకం లేదు. గట్టిగా గద్దించారు. అసలు విషయం చెప్పింది భాగ్యలక్ష్మి. తరగతిలోని పిల్లలందరు తనని వింతగా చూసారు. టీచర్‌కు ఏం చేయాలో అర్థం కాలేదు. వెంటనే తల్లిదండ్రులకు ఫోన్‌ద్వారా విషయం చెప్పారు. ఇంటికెళ్ళిన భాగ్యలక్ష్మిని



వాళ్ళమ్మ ఏమి అనలేదు. కొద్ది సేపటి తరువాత వాళ్ళమ్మ దగ్గరగా కూర్చోబెట్టుకుని "పుస్తకాలు సరస్వతీ స్వరూపం వాటిని చించడం, విసిరివేయడం, అమ్మడం, దొంగిలించడం క్షమించరాని తప్పు. తెలిసో తెలియకో నిర్లక్ష్యంగా అమ్మేసావు కాని పుస్తకాలు మన జీవితానికి వెలుగులు పంచుతాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే చీకట్లు అలుముకుంటాయి. ఒకప్పుడు పుస్తకాలు కొనే స్థోమత లేక చాలామంది చదువుకు దూరమయ్యారు. అది గ్రహించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇస్తుంది. వాటిని ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి. కాని చిన్నచిన్న కోరికల కోసం పుస్తకాలను అమ్మడం ఎంత తప్పో తెలుసా' అంది.

"అమ్మా.. ఇంకెప్పుడు ఇలాంటి పని చేయనమ్మా.. నన్ను నమ్ము అమ్మ, ప్లీజ్ అమ్మ. నాకు పుస్తకాలు కొనివ్వు బాగా చదువుకుంటాను. ప్లీజ్ అమ్మా" అంటూ ఏడుస్తూ తల్లిని బతిమాలుతుంది భాగ్యలక్ష్మి.

ఇంతలో మంజుల సెల్ మోగింది. అవతల నుండి తెలుగు టీచర్ "మంజుల గారు మీ అమ్మాయి చాలా మంచిది. తెలిసో తెలియకో పుస్తకాలు అమ్మింది. ఏమి అనకండి. మా దగ్గర గత సంవత్సరం చదివిన విద్యార్థుల పుస్తకాలు ఉన్నాయి. అవి నేను ఇప్పిస్తాను. మీరేం కొనకండి" అన్నారు.

"అలాగేనండి, ధన్యవాదాలు" అని ఫోన్ పెట్టేసింది మంజుల. విషయం భాగ్యలక్ష్మికి చెప్పింది. టీచర్‌కు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది భాగ్యలక్ష్మి. అప్పటి నుండి ఇష్టంగా చదువుతూ, తరగతిలోనే ఫస్టు వచ్చేది భాగ్యలక్ష్మి.

**నీతి: పుస్తకాలు సరస్వతి స్వరూపం, వాటిని ఉపయోగించుకుంటే వెలుగులు, లేకుంటే జీవితంలో చీకట్లు.**

**– జల్లా లావణ్య**

10వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్. రిక్కాబజార్, ఖమ్మం



# బాలచెలిమి

బాలబాలికల నేస్తం
బాలచెలిమి పుస్తకం
బాలచెలిమి కలిమితోడ
వికసించును మస్తకం

కమ్మనైన కథల కోట
తీయని గేయాల తోట
పసందైన కబుర్లతో
పరచిన ముత్యాల బాట

మన ఆటలు మన పాటలు
మన అల్లరి మన ఆరడి
మన సంస్కృతి మన నడవడి
తెలియజేయు చెలిమిబడి

తీయనైన తెలుగు పలుకు
వింటేనే తేనెలొలుకు
తెలుగుతనం మూలధనం
తెలివి పెంచు మేలుకొలుపు

రంగురంగు బొమ్మలతో
హాయిషారైన హాస్యంతో
చక్కిలిగింతల పత్రిక
బాలల మానస పుత్రిక

రత్నవీణ తెలంగాణ
పలికిన రాగాలెన్నో
తెలంగాణ మాగాణము
పంచిన పాఠాలెన్నో

కొత్త కొత్త విషయాలను
మనము నేర్చుకుందాం
బాలచెలిమి చదివి మనను
మనము తీర్చిదిద్దుకుందాం



**తుమ్మూరి రామ్మోహనరావు**
m : 9701522234



# వెనిస్ వర్తకుడు



చాలా కాలం క్రితం వెనిస్ నగరంలో ఆంటోనియో అనే సముద్ర వ్యాపారి ఉండేవాడు. విలువైన సరుకులతో నిండిన అతని ఓడలు ఎప్పుడూ సముద్రం మీద తిరుగుతూ ఉండేవి. ఆంటోనియో చాలా మంచివాడు. పేదలకు వడ్డీ లేకుండా అప్పులు ఇస్తూ ఉండేవాడు. బెసానియో అతని మిత్రుడు. బెసానియో చాలా దుబారా మనిషి. అయితే ఆంటోనియో బెసానియోకి అడిగినప్పుడల్లా లేదన కుండా డబ్బు ఇచ్చేవాడు.

వెనిస్ నగరంలోనే షైలాక్ అనే వడ్డీవ్యాపారి ఉండేవాడు. వడ్డీ మీద వడ్డీ గుంజుతూ అప్పు తీసుకొన్న వాళ్ళని పీడించుకు తినేవాడు. వడ్డీ లేకుండా పేదవాళ్ళకు అప్పులు ఇచ్చి తన వడ్డీ వ్యాపారాన్ని దెబ్బ తీస్తున్నాడని, ఆంటోనియో మీద షైలాక్‌కి పీకల దాకా కోపం ఉండేది. తనకంటూ అవకాశమొస్తే ఆంటోనియోకు పుట్టగతులు లేకుండా చెయ్యాలని పదే పదే అనుకునేవాడు.

బెల్మాంట్‌లో నివసించే పోర్షియా చాలా అందమైన యువతి. ఆమె ఎంతో ధనవంతురాలు కూడా. ఆమె ఒక పెద్ద భవనంలో నివసించేది. బెసానియో, పోర్షియా ఒకరిపై మరొకరు మక్కువ పెంచుకొన్నారు. అయితే పోర్షియాను వివాహ మాడటానికి బెసానియో బెల్మాంట్ వెళ్లాలి. అదేగాక పెళ్ళికి బోలెడు డబ్బు కూడా ఖర్చవుతుంది. అందుకే మిత్రుడు ఆంటోనియోను డబ్బు అప్పు అడిగాడు. ఆంటోనియో డబ్బు అంతా వ్యాపారంలో మదుపు పెట్టేశాడు. అందుకే మిత్రుడి అవసరం కోసం ఆంటోనియో అప్పుకోసం షైలాక్ దగ్గరికి వెడతాడు.

ఇంతకాలానికి ఆంటోనియోకు, తనతో అవసరం వచ్చినందుకు షైలాక్‌కి చెప్పలేని ఆనందం కలిగింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఆంటోనియోని ఉచ్చులో బిగించి తన అడ్డు తొలగించు కోవాలనుకొన్నాడు. అందుకే ఆంటోనియో అడిగిన మూడు వేల బంగారు నాణాలు వడ్డీ తీసుకోకుండా ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. అయితే ఒక షరతు పెట్టాడు. మూడు నెలల్లోగా ఆంటోనియో తన బాకీ తీర్చకపోతే, అతని గుండెకాయ దగ్గర నుంచి ఒక పౌను (సుమారు అరకిలో) మాంసాన్ని తాను తీసుకునేందుకు వీలుగా ఆంటోనియో ఒప్పందం పత్రాన్ని రాసివ్వాలన్నాడు. తన ఓడలు తొందరలోనే వస్తాయి కాబట్టి ఆంటోనియో నిర్భయంగా ఒప్పందం రాసి ఇచ్చాడు.

ఆ డబ్బు తీసుకొని బెసానియో బెల్మాంట్ వెళ్ళాడు. పోర్షియాను వివాహం చేసుకొన్నాడు. కానీ ఇంతలో అనుకోని సంఘటనలు జరిగాయి. విలువైన సరుకులతో నిండిన ఆంటోనియో ఓడలు సముద్రంలో మునిగిపోయినట్లు వార్త వచ్చింది. దాంతో ఆంటోనియో తన ఆస్తినంతా కోల్పోయాడు. షైలాక్‌కి ఇచ్చిన గడువు దగ్గర పడసాగింది. అతని దగ్గర చిల్లిగవ్వ కూడా లేదని తెలుసుకొన్న షైలాక్ గడువు పూర్తయిన మరునాడే ఒప్పందం అమలు జరపాలని ఆంటోనియో మీద న్యాయస్థానంలో దావా వేశాడు.

బెసానియోకి ఈ సంగతి తెలిసింది. వెంటనే అతడు డబ్బు తీసుకొని మిత్రుణ్ణి కాపాడటానికి హుటాహుటిన వెనిస్ వెడతాడు. పోర్షియా కూడా అతనికి తెలియకుండా మగవేషంలో వెనిస్ వెడుతుంది. ఆంటోనియో కేసు విచారణకు వస్తుంది. ఆంటోనియో మీద దయ చూపించమని న్యాయమూర్తి ఇచ్చిన సలహాను షైలాక్ పెడచెవిన పెడతాడు. బెసానియో ఇవ్వజూపిన ఆరు వేల బంగారు నాణాలను తిరస్కరిస్తాడు. అంతేకాదు. ఆంటోనియో గుండెకాయ దగ్గర నుంచి అరకిలో మాంసం తీసుకొనే అధికారం తనకు ఇచ్చి న్యాయం చేకూర్చమని మొండి వాదన చేస్తాడు.

ఇంతలో న్యాయవాది వేషంలో ఉన్న పోర్షియా అక్కడికి వస్తుంది. మగవేషంలో ఉన్న తన భార్యను బెసానియో గుర్తించడు. ఆంటోనియో తరఫున వాదించే అవకాశం తనకు ఇవ్వమని న్యాయమూర్తిని అడుగుతుంది. న్యాయమూర్తి అంగీకరిస్తాడు. పోర్షియా ఒప్పందం పత్రాన్ని జాగ్రత్తగా చదువుతుంది. కావలసినంత డబ్బు తీసుకొని ఆంటోనియో మీద దయ చూపమని షైలాక్‌కి విన్నపం చేస్తుంది. అతడు ససేమిరా వల్లకాదంటాడు. ఒప్పందం ప్రకారం జరగాల్సిందేనని భీష్మించుకు కూర్చుంటాడు. సరే అంటుంది పోర్షియా. న్యాయం షైలాక్ వైపే ఉందని కూడా నొక్కి చెబుతుంది.



షైలాక్ పోర్షియాని వేనోళ్ళ పొగిడి ఆంటోనియో గుండెకాయ దగ్గర్నుంచి అరకిలో మాంసం తీసుకోవడానికి కత్తి పదును పెట్టుకుంటూ ఉంటాడు.

ఆంటోనియో దైవంపై భారం వేసి చావుకు సిద్ధ పడతాడు. కత్తి తీసుకొని ఆంటోనియోని చీల్చడానికి ముందుకు వస్తున్న షైలాక్‌ని ఒక్కక్షణం ఆగమంటుంది పోర్షియా. ఒప్పందం ప్రకారం ఒక పౌను మాంసాన్ని మాత్రమే తీసుకోవాలనీ, ఒక్క రక్తం చుక్క కూడా చిందకుండా ఆ మాంసాన్ని తీసుకోవాలనీ అంటుంది. ఆ షరతు విన్న షైలాక్ ఉత్సాహం నీరు కారిపోయింది. ఒక్క చుక్క రక్తం కారినా, అది ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లవుతుందనీ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే చట్టప్రకారం మరణ శిక్ష పడుతుందనీ, పోర్షియా చెబుతుంది. రక్తం చిందకుండా మాంసం తీసుకోవడం అసాధ్యం కాబట్టి బెసానియో ఇవ్వజూపిన డబ్బు తీసుకుంటానంటాడు షైలాక్. న్యాయమూర్తి దానికి ఒప్పుకోడు. షైలాక్‌కి ప్రాణ భిక్ష మాత్రం పెట్టి అతడి ఆస్తిని న్యాయమూర్తి స్వాధీనం చేసుకుంటాడు.

ఆంటోనియోను మట్టుపెట్టాలనుకున్న షైలాక్ తను తీసుకున్న గోతిలో తానే పడతాడు. అంత చక్కని సమయస్ఫూర్తిని చూపి, తన మిత్రుణ్ణి కాపాడిన యువ న్యాయవాది, మగవేషంలో ఉన్న తన భార్య పోర్షియా అని తెలుసుకున్న బెసానియో ఆనందానికి అంతులేదు.

**– విలియమ్ షేక్స్పియర్**

# మరచిపోలేని మిత్రుడు


2.7.2017 ఒక మరిచి పోలేని రోజుగా మిగిలి పోయింది, నా జీవితంలో. ఆ రోజు సుమారు 9.30 కావోస్తుంది, మా అమ్మా నాన్నతో కలిసి ఆ రోజు మా అత్తయ్య వాళ్ళ ఇంటికి వెళ్ళొస్తున్నాము. ఆ రోజు మా అత్తయ్య ఇంట్లో బోనాల పండుగ అయ్యింది. మా నాన్న ఒక ఆటో మాట్లాడాడు. మేము అప్పటికే అలసిపోయి ఉన్నాం. మా నాన్న ఆ ఆటో అతనితో మాట్లాడుతుండగా, ఆయన తన జీవితంలో ఒక సంఘటన గురించి ఇలా చెప్పాడు..

నేను ఒకరోజు రైల్వేస్టేషన్‌కి వెళ్ళాను. అక్కడ ఒక చిన్నపాప ఏడుస్తూ అటు, ఇటు ఎంతో బాధతో ఎవరికోసమో వెతుకుతోంది.

నేను చాలా సేపు చూసాను, చివరికి ఆ పాప దగ్గరకు వెళ్ళి "ఏం పాప ఎవరునువ్వు, ఎక్కడి నుండి వచ్చావు, మీ అమ్మా, నాన్నా పేరేమిటి?" అని అడిగాను. తాను దుఃఖం ఆపుకోవట్లేదు. ఎంతో ఏడుస్తుంది. నేను ఆపాపను దగ్గరలో ఉన్న హోటలుకు తీసుకెళ్ళి కొన్ని పాలు తాగించాను, ఆ పాప కొంచెం ఏడుపు ఆపింది. ఆమె గుజరాత్‌లో బస్సు ఎక్కినది. ఎక్కడ దిగిందో తెలియదని ఎంతో ఆవేదన చెందింది. ఇక ఆ పాపను ఎత్తుకొని నేను సికిందరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళాను. అక్కడ ఉన్న పోలీసుకి విషయం చెప్పాను. కానీ ఒక 'పాప' తప్పిపోతే తెచ్చి యిచ్చినందుకు మెచ్చుకోక "నీవు ఎవరు, ఈ పాపను ఎందుకు తీసుకొచ్చావు?" అని నన్ను పంపించారు.



వారికి సంబంధించిన వారెవరైనా వస్తే అప్పగిస్తామన్నారు. తర్వాత బాల సదనానికి పంపించారు. నా ఫోన్ నెంబర్ ఇంటి అడ్రస్ వివరాలు రాసుకొని పంపారు. పాపకు బిస్కట్లు, అరటిపండు, పాలు ఎస్ఐ తెప్పించారు. ఇక ఇంటికి వెళ్ళి



పడుకున్న, కానీ ఆ పాప ఏడుపే నా బుర్రలో తిరుగుతున్నది. నేను ఇంక దుఃఖం ఆపుకోలేకపోయాను. ఈ పోలీసులతో పనికాదని, గుజరాత్‌లోని ఒక పత్రికాధికారికి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాను. 'అలాగే, మా పేపర్‌లో సమాచారాన్ని ప్రచురిస్తాం, విషయం పోలీసులకు తెలియజేస్తా' నన్నాడు.

కొన్ని రోజుల తరువాత ఆ పాపకు సంబంధించిన వారు వచ్చారని విషయం తెలిస్తే, నేను పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళాను. ఆ అమ్మ ఆవేదన, ఆ చిన్న పాపకళ్ళలో సంతోషం, ఆ నాన్న ఆనందం నిజంగా అతన్ని అన్ని రకరకాల ప్రశ్నలు అడిగాక బాలసదనం నుండి అమ్మతోటి పంపించారు. జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకంగా మిగిల్చింది. ఆ తల్లీ బిడ్డల్ని ఒక్కచోట చేర్చినందుకు ఎంతో సంతోషించాడు ఆటో ఆయన. తన జీవితంలో జరిగిన సంఘటన గురించి చెప్పాడు. నిజంగా ఇలాంటి మంచి మిత్రులు దేశంలో, రాష్ట్రంలో ఈ ప్రపంచమంతా ఉంటే ప్రతి జీవితం ఆనందమయం.

– ఇ. మనోజ్ సింహ
9వ తరగతి, ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్,
హైదరాబాద్.

చందదారులుగా చేరండి! బాల చెలిమి చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
Bala Chelimi
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సం॥లకు | : రూ. 750 |

*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**Account Details :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

# స్నేహం కోసం

ఒకానొక సముద్రంలో ఒక చిన్న ఎండ్రకాయ నివశిస్తూ ఉండేది. ఆ సముద్రాన్ని అందరూ 'నీలి సముద్రం' అని పిలిచేవారు. కాని ఎండ్రకాయకు మాత్రం సముద్రమెప్పుడూ బూడిద రంగులోనే కనిపించేది. అందరూ నీలి సముద్రం అని ఎందుకు పిలుస్తున్నారో అర్థమయ్యేది కాదు. ఈ చిన్న ఎండ్రకాయకు కవచం ఉండేది కాదు.



"ఎలాగైనా ఓ కవచం సంపాదించుకో. అది నిన్ను కాపాడుతుంది" చెప్పింది మామ ఎండ్రకాయ.

మామ చెప్పినట్లు ఎండ్రకాయ కవచం కోసం ఎంతో ప్రయత్నించి చివరికి ఒకటి సంపాదించింది. కాని తనకి సముద్రం బూడిద రంగులో కనిపిస్తుందని దిగులుగా ఉండేది. డాల్ఫిన్ వచ్చి "నీవు ఒంటరిగా ఉన్నావు కాబట్టి నీకు సముద్రం బూడిద రంగులో కనిపిస్తుంది. నిజమైన స్నేహితుడ్ని సంపాదించు కోగలిగితే, సముద్రం నీకూ నీలంగా కనిపిస్తుంది. అప్పుడు నీవు ఆనందంగా ఉంటావు అంది.

ఎండ్రకాయ స్నేహితుని కోసం వేట మొదలెట్టింది. కొన్ని చేపలయితే ఎండ్రకాయని అసలు పట్టించుకోలేదు. కొన్ని సముద్ర జీవులు ఎండ్రకాయని తినేయాలని చూశాయి. వెతికి వెతికి చివరికి నిరాశ చెందింది. ఎండ్రకాయకి ఇంతలో ఎవరో బాధతో పాట పాడుతున్నట్టు వినిపించింది. తిరిగి చూస్తే అందమైన ఎర్రటి సముద్రపు రోజా కనిపడింది. ఎండ్రకాయ తనని పరిచయం చేసుకుని, ఎందుకు బాధగా ఉన్నావని అడిగింది. రోజా ఇలా అంది. "నాకు సముద్రం బూడిద వర్ణంలో కనిపిస్తుంది. అది నీలంగా కనిపించాలంటే ఓ నిజమైన స్నేహితుడు కావాలి". ఎండ్రకాయ కూడా తన కథంతా చెప్పింది. తర్వాత రోజాని తన వీపువై ఎక్కించుకుంది. ఇద్దరూ కలిసి స్నేహితుల కోసం వెతకసాగారు.

'స్కార్‌లెట్ సిటీ' అనే సముద్రంలో స్నేహితులు దొరుకుతారని చెప్పింది రోజా. సరేనని అక్కడికి ప్రయాణం ప్రారంభించారు. రోజా, ఎండ్రకాయ వీపు మీద కూర్చుని సముద్రం అంతా చూస్తూ, కేరింతలు కొడుతూ ఆనందించింది. దారిలో వాళ్లకి మామ ఎండ్రకాయ కనిపించింది.

స్కార్‌లెట్ సిటీకి వెళ్ళే దారిలో 'మిస్ట్రస్ సి' అనే ఆక్టోపస్ ఉంది. అది ఎన్నో ఎండ్రకాయల్ని తినేసింది, జాగ్రత్త అని చెప్పింది. స్కార్‌లెట్ సిటీ అనేది ఏడవ సముద్రం. ఆరు సముద్రాలు దాటిన తర్వాతే దాన్ని చేరుతామని చెప్పింది మామ ఎండ్రకాయ.

'సరే, ధన్యవాదాలు' అంది చిన్న ఎండ్రకాయ. అలా ఎండ్రకాయ, రోజా ఆరు సముద్రాలూ దాటాయి. దారిలో ఒకరి జీవితంలో సంగతులు మరొకరితో పంచుకున్నారు, నవ్వుకున్నారు, తిట్టుకున్నారు, కొట్టుకున్నారు. అలా ప్రయాణించారు. చివరికి ఏడవ

సముద్రంలోకి జాగ్రత్తగా ప్రవేశించారు. 'మిస్ట్రస్ సి' ఆక్టోపస్ వీళ్ళను చూసింది. తన పొడవాటి తొండాలతో వీళ్ళను బంధించింది. రోజా తన నోటిని తెరచి వరుసగా పదునైన బాణాలను సంధించింది. అవి గుచ్చుకొని ఆక్టోపస్ బాధతో విలవిలలాడుతూ, అక్కడ నుండి పారిపోయింది.

"నాకు ఏ స్నేహితుడు అక్కర్లేదు నువ్వు తప్ప" అన్న మాటలు ఎండ్రకాయ, రోజా నోటి నుండి ఒకేసారి ఊడిపడ్డాయి. ఆ తర్వాత చూస్తే అప్పుడు వాళ్లకు సముద్రం అంతా నీలంగా కనిపించింది. వాళ్ళు ఇప్పటికీ నిజమైన స్నేహితులుగా, కష్టసుఖాలు పంచుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు. చిన్నారులూ! మీ నిజమైన స్నేహితుల పేర్లు చెప్పండి.

స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**
m : 8179273974

ఇంగ్లీష్ : ది హెరమిట్ అండ్ ద రోజ్
రైటర్ : బోరిస్ జకోదర్, రష్యన్ జానపద కథలు

## దిండూ - తుండూ

నెత్తి కింద దిండు
మొలకు చుట్టు తుండు
ఆడటానికి చెండు
తినడానికి పండు
గీకటానికి గుండు
గోకటానికి సుండు
ఒరగటానికి గోడ
ఆగడానికి నీడ
బతుకును ఇచ్చేది చెట్టు
నువ్వు కూడా కొన్ని పెట్టు




## వాన



తడిసింది చాలు
ఇకనైనా లోనికొస్తే మేలు
జలుబు చేస్తే కష్టం..
జ్వరం వస్తే నష్టం..
ఆపై.. ఇక..
నీ ఇష్టం..

## ఊహ




సబ్బులతో స్నానం
మబ్బులపై ప్రయాణం
చుక్కలతో చెలిమి
సూర్యుడే మన బలిమి..



- గంగదేవు యాదయ్య, m : 9059112105

# నిజమైన జోస్యం

హాని ప్రతిరోజు ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్ళే నానమ్మతో బయటకు వెళ్ళి సైకిల్‌తో ఆడుకుంటాడు. ఆ రోజు కూడా సైకిలు తొక్కుకుంటూ కాలనీలో ఆడుకుంటున్నాడు హని. హనికి దగ్గరగా ఉన్న పార్క్‌లోంచి 'టక్... టక్... టక్...' అంటూ శబ్దం వినిపించింది. మెల్ల మెల్లగా ఆ శబ్దం ఎక్కువ కాసాగింది. కుతూహలాన్ని ఆపుకోలేక నాన్నమ్మతో చెప్పి శబ్దం వినిపిస్తున్న పార్కులోకి వెళ్ళాడు. చుట్టూ చూస్తుండగా... దూరంగా ఒక మామిడి చెట్టు పైన కూర్చున్న ఒక వ్యక్తి కొమ్మను నరుకుతున్నాడు.



అది చూడగానే హని పరిగెత్తుకు వెళ్ళి 'అంకుల్... కొమ్మను కొట్టకండి... కొమ్మను నరికితే మనకు చాలా నష్టం. దయచేసి కొట్టకండి ప్లీజ్...' అంటూ అభ్యర్థించాడు. హని మాటలు విననట్టే నటిస్తూ అతడు తనపని తాను చేసుకోసాగాడు. ఆ మూర్ఖుడు తాను కూర్చున్న కొమ్మనే కొడుతున్నాడు. అది చూసిన హని 'అంకుల్, మీరు కొమ్మను కొట్టడం ఆపండి... లేకుంటే వెంటనే కిందపడి పోతారు' అని చెప్పాడు. హని మాటలు పెడచెవిన పెట్టిన ఆ మూర్ఖుడు కోపంతో హని పైకి కొమ్మలను విసిరివేయడంతో భయంతో వాడు నానమ్మ దగ్గరికి పరిగెత్తి వెళ్ళాడు.


దూరంగా వెళ్ళి సైకిల్ తొక్కుకుంటున్న హనికి రెండు మూడు నిమిషాల్లో చెట్టుపై నుంచి దబ్బున ఏదో పడిన చప్పుడు వినిపించింది. అందరితో పాటు పరుగెత్తుకు వెళ్ళి చూడగా కూర్చున్న కొమ్మనే నరుక్కున్న ఆ మూర్ఖుడు కిందపడి ఏడుస్తున్నాడు. అంతా తలోమాట అనసాగారు. నానమ్మ పక్కన నిలుచుని బిక్కుబిక్కు మని చూస్తున్న హనిని చూడగానే ... 'బాబూ!నువ్వు చెప్పిన జోస్యం నిజమైంది. నేను నీ మాటలు పెడచెవిన పెట్టి చెట్టును కొట్టాను. చెట్టు కొమ్మను కొట్టడం వల్ల కింద పడిపోయాను. ఇకముందు ఎప్పుడూ చెట్టును కొట్టను' అంటూ చెంప లేసుకున్నాడు.


కూర్చున్న కొమ్మనే నరుక్కుని పడిపోయి, అది తన జోస్యానికి ముడిపెట్టిన అతడి మూర్ఖత్వానికి నవ్వుకుంటూ, 'పర్యావరణానికి హాని కలిగిస్తే మనం బతకడం కష్టమవుతుందని, అవసరం లేనిదే చెట్లు కొట్టవద్దని మా టీచర్ చెప్పారు. పర్యావరణాన్ని రక్షిస్తే మనం ఆనందంగా జీవిస్తాం. అంకుల్! ఇకపై చెట్లను కొట్టడం ఆపండి. మీరు తప్పు చేసారు కాబట్టే పర్యావరణమాత మిమ్మల్ని కిందకు తోసేసింది' అనగానే అందరూ చప్పట్లు కొట్టారు. నానమ్మ హనిగాడి బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.

– డా. పత్తిపాక మోహన్
m : 9966229548

# సమ్మోహనరాగం

రచన : చొక్కాపు వెంకటరమణ, బొమ్మలు : టి. గంగాధర్
m : 9246520050 m :7702037198




రాజయ్య పతాక స్థాయిలో రాగం ఆలపిస్తున్నాడు.
ఆCCC...
దొంగలు పెద్దగా ఆవులిస్తూ జోగుతున్నారు.
కాసేపటికి దొంగలిద్దరూ పక్కకి ఒరిగిపోయి గుర్రుపెట్టి నిద్రపోసాగారు.
రెండు గంటల పాటు కచేరీ చేయమన్నారు నేను వచ్చిన పని అయిపోయింది.
రాజయ్య తన దారిన పోయాడు
తెలతెలవారుతుండగా ధనాగారం సమీపంలో చెట్లమధ్య గుర్రుపెట్టి నిద్రపోతున్న ఇద్దరు దొంగల్ని నిద్రలేపి ఖైదు చేశారు భటులు!
తెల్లవారింది లేవండి
ఆ రాత్రి కాపలాభటులు ప్రక్కనున్న అడవి నుంచి వినిపించే సింహగర్జనలకు గుండె బెదరకుండా చెవులలో దూది పెట్టుకున్నారు. అందుకే 'సమ్మోహన రాగం' ప్రభావం వారిపై పడలేదు.
దొంగలు ఆ రాగానికి పరవశులై నిద్రలోకి జారి కారాగారం పాలయ్యారు.
ఎవరు తీసుకున్న గోతిలో వారు పడటము ఖాయం! పొరుగు వారికి కొంచెమైనా సాయపడటమే న్యాయం!
-సమాప్తం-

# అమ్మ

అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో ఉండే చిన్నపాటి పేదరైతు రామయ్య. తన భార్య సీతమ్మ. వీరి గారాల కొడుకు శివ.

వీరి కుటుంబం చాలా ఆనందంగా ఉండేది. దురదృష్టవశాత్తు అనారోగ్యంతో రామయ్య మరణించాడు. దీనితో సీతమ్మకు జీవితం భారమైంది. ఇల్లు గడవడమే కష్టమైంది. రోజురోజుకు శివ పెరిగి పెద్దవాడవుతున్నాడు.

దీనితో సీతమ్మకు అవసరమగు సామాగ్రి ఎక్కువైపోయింది. వీళ్ళ ఊరు పల్లెటూరు కావడంతో, వస్తువులు కొనుగోలు చేయడానికి పట్నం వెళ్ళాలి. ఇలా వీరి జీవితం సాగుతోంది.

సీతమ్మ పొలం పనులు చేస్తూ కూరగాయలు అమ్ముతూ డబ్బులు సంపాదిస్తోంది.

ఒకరోజు సీతమ్మకు పట్నం వెళ్ళవలసిన అవసరం వచ్చింది. సీతమ్మ బయలుదేరుతుంటే, శివ నేను వస్తానని మారాం చేయడంతో, సీతమ్మ శివను కూడా తీసుకెళ్ళింది.



పట్నం వెళ్ళాలంటే మధ్యలో ఒక నదిని దాటాలి. ఆ నది దాటడానికి అందుబాటులో ఏ నావ లేకపోవడంతో, తాటి మట్టలతో తయారు చేయబడిన ఒక దోనెలాంటి పడవ మాత్రమే ఉండటంతో దానిలోకి సీతమ్మ, శివ సహా పడవ నడిపేవారు ఎక్కి కూర్చున్నాడు.

పడవ నది మధ్యలోకి చేరుకుంది. శివ కొంటే చేష్టలకు హఠాత్తుగా ఆ పడవకు చిల్లు పడింది.

దానితో కొంచెం కొంచెంగా ఆ పడవలోకి నీరు చేరుకోసాగింది. ఆ పడవ మునిగిపోయే దశకు వచ్చింది. అప్పుడు పడవ నడిపే అతను, 'పడవలో బరువు పెరిగి పడవతో సహా మనం ముగ్గురం మునిగి చనిపోతాం' అని చెప్పడంతో, సీతమ్మ ఒక్క నిమిషం ఆలస్యం చేయకుండా, తన గురించి ఆలోచించకుండా ఆ నదిలోకి దూకి ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుంది.

అప్పుడు పడవలో బరువు తగ్గి, పడవ ఒడ్డుకు చేరుతుంది. సీతమ్మ తన బిడ్డ ప్రాణం కాపాడడం కోసం ఈ సాహసం చేయాల్సివచ్చింది.

– బొమ్మెల్ల లక్ష్మణ్ కుమార్

10వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్. రాస్పల్లి, కాగజ్‌నగర్.

# త్వరగా వచ్చి గిల్లిపో



పిల్లలందరిని ఒక వరసలో కూర్చోపెట్టాలి. వరసలో నుండి ఒక పిల్లవాడిని కొద్ది దూరంగా తీసుకువెళ్లి కూర్చోబెట్టాలి.

వరసలో కూర్చున్న మిగిలిన పిల్లలకు బస్సు, రైలు, కారు, లారీ... మొదలైన పేర్లు పెట్టాలి.

కొద్ది దూరంలో కూర్చోబెట్టిన పిల్లవాడికి పైన పేర్లు పెట్టబడిన పిల్లలు ఎవరో తెలియకూడదు.

ఇప్పుడు దూరంగా కూర్చోబెట్టిన పిల్లవాడి కళ్లు మూసి, "బస్సు... బస్సు... త్వరగా వచ్చి గిల్లిపో" అని మనం పిలవాలి.

వరసలో నుండి "బస్సు" పేరు పెట్టబడిన పిల్లవాడు వచ్చి, కళ్లు మూయబడిన పిల్లవాడి ముక్కు గిల్లి, పాం పాం అని తిరిగి యథాస్థానంలో కూర్చుంటాడు.

ఇప్పుడు మన దగ్గర కళ్లు మూయబడిన పిల్లవాడి కళ్లు తెరిచి, తనను ముక్కు గిల్లినది ఎవరో గుర్తించమని అడగాలి.

ముక్కు గిల్లినది ఎవరో గుర్తిస్తే: గుర్తించిన వాని స్థానంలో కళ్లు మూయబడిన వాడు కూర్చుంటాడు. గుర్తించబడిన వాడిని మన దగ్గరకు రమ్మని, కళ్ళు మూసి, ఏదైనా పేరుతో ఉదా: రైలు... రైలు... త్వరగా వచ్చి గిల్లిపో" అని ఆట మొదలుపెట్టాలి.


ముక్కు గిల్లిన వాడిని తప్పుగా గుర్తిస్తే : తిరిగి కళ్లు మూసి "లారీ... లారీ త్వరగా వచ్చి గిల్లిపో"... అని ముక్కు గిల్లిన వాడిని సరిగా గుర్తించే దాకా ఆడించాలి.

– వై. యాదగిరి

## జోక్స్

టీచర్ : "భూమిపైనా, నీటిలోనూ జీవించే ఒక జంతువు పేరు చెప్పరా?"
విద్యార్థి: "కప్ప సార్"
టీచర్: "భేష్! మరో పేరు చెప్పు"
విద్యార్థి: ఇంకొక కప్ప సార్!





టీచర్ : "ఏరా! రాముూ... కోడి గుడ్డు పెడుతుంది గాని, ఒంటె పెట్టదేం..?'
రాము: "మరి ఒంటె గుడ్డు పెడితే అంత ఎత్తు నుండి కిందపడి పగిలిపోతుంది కదండీ. అందుకు..?"

# ఆదిత్య కథ

అనగనగా ఒక మహానగరం. ఆ నగరంలో శ్రీను – రవళి అనే దంపతులు ఉండేవారు. వీరికి ఒక కొడుకు ఉండేవాడు. వాడి పేరు ఆదిత్య. శ్రీను రిక్షా తొక్కుతూ ఉండేవాడు. తన కొడుకును రోజు పాఠశాలకు తన రిక్షాలో దింపి అట్నుంచి తానూ రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అలా కొన్ని రోజుల తరువాత ఒకరోజు శ్రీను తన కొడుకుతో తన రిక్షాలో పాఠశాలకు వెళ్తుండగా, అనుకోకుండా ఆదిత్యను లారీ గుద్దింది. అది చూసిన శ్రీను ఆదిత్యను పట్టుకుని వెంటనే అంబులెన్సుకి ఫోన్ చేసాడు. అంబులెన్సు డ్రైవర్ వచ్చి ఆదిత్యను అంబులెన్సులో ఎక్కించాడు.

అంబులెన్సు డ్రైవర్ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఒక కంపౌండర్‌కి ఫోన్ చేసి, 'ఒక బాలుడికి లారీ గుద్దింది. తలకు పెద్ద గాయం అయ్యింది. మీ ఆసుపత్రికి వస్తున్నాడు' అన్నాడు కంపౌండర్, 'వద్దు ఈ ఆసుపత్రిలో చాలా మంది ఉన్నారు వద్దు' అన్నాడు. శ్రీను అన్నాడు. 'డ్రైవర్ బాబు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళు' అని చెప్పాడు. కానీ డ్రైవర్ 'ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు పట్టించుకోరు, వద్దు' అన్నాడు. శ్రీను, సరే అన్నాడు అలా డ్రైవర్ మళ్ళీ వేరే ఆసుపత్రి కంపౌండర్‌కి ఫోన్ చేసాడు. ఆ కంపౌండర్, 'ఇక్కడ వద్దు, ఈ డాక్టర్లు మనకు డబ్బులు తక్కువ ఇస్తారు అన్నాడు, మళ్ళీడ్రైవర్ వేరే ఆసుపత్రి కంపౌండర్‌కు ఫోన్ చేసాడు ఆ కంపౌండర్ రమ్మన్నాడు. డ్రైవర్ ఆ ఆసుపత్రికి ఆదిత్యను తెచ్చాడు. డాక్టర్ ఆదిత్యను చూసి ఆపరేషన్ చేయాలి అని చెప్పాడు. శ్రీను 'డాక్టర్ ఆపరేషన్‌కి ఎంత ఖర్చు అవుతుంది?' అని డాక్టర్‌ని అడిగాడు. డాక్టర్ 'పన్నెండు లక్షలు కానీ, నిన్ను చూస్తే జాలి వేస్తుంది. నీ కోసం తగ్గిస్తున్నాను. పది లక్షలు



తయారు చేసుకోండి. ముందు అడ్మిషన్‌కి యాభై వేలు కట్టండి' అన్నాడు. శ్రీను ఎలాగో, తాను దాచుకున్న యాభై వేలు కట్టాడు. మిగతా పది లక్షలు కోసం తన కొడుకు చదువు కోసం దాచుకున్న ఏడు లక్షలు ఇచ్చాడు, కానీ డాక్టర్‌కి తెలుసు ఆదిత్యకు ఆపరేషన్ చేసినా జీవించడని శ్రీను డాక్టర్‌ను బ్రతిమిలాడి చెప్పాడు, 'ఆపరేషన్ చేయండి. కౌంటర్ దగ్గర ఏడు లక్షలు కట్టాము. మిగతా మూడు లక్షలు ఆపరేషన్ తరువాత కడతాము' అని శ్రీను ముందే ఆదిత్యను నర్సులు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకుపోయారు. కొన్ని నిమిషాల తరువాత డాక్టర్ ఆపరేషన్ థియేటర్ నుండి వచ్చి, 'క్షమించండి మీ కొడుకు చనిపోయాడు. మిగతా మూడు లక్షలు, కింద కౌంటర్‌లో కట్టి, శవాన్ని తీసుకుపోండి' అన్నాడు. అది విన్న శ్రీను భార్య ఏడుస్తూ, 'మీరు మనుష్యులేనా మీకు మానవత్వమే లేదా' అని అన్నది. ప్రాణాలు బతికించుకోవడానికి ఒక వైద్యశాలలో చేరిన ఒక ఆదిత్య కథ.

– సయ్యద్ సలీం
9వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్.

# రోదసీలో పుట్టిన తొలిప్రాణి



ఇది మామూలు పక్షిపిల్ల కాదు.
ఇది రష్యా తూర్పు ప్రాంతంలో కనిపించే ఒక రకం కౌజుపిట్టపిల్ల.
ఇది రోదసీ శాస్త్రరంగంలో రికార్డు సృష్టించిన ప్రాణి.
మొదట రోదసీలోకి వెళ్ళిన వ్యక్తి - యూరీగగారిన్.
మొదట చంద్రునిపై కాలుమోపిన వ్యక్తి - నీల్ ఆర్మ్ స్ట్రాంగ్.
మొట్టమొదట రోదసీలోకి వెళ్ళిన స్త్రీ - వాలెంతినా తెరిష్కోవా.
తొలిసారిగా రోదసీలోకి వెళ్ళిన భారతీయుడు స్క్వాడ్రన్ లీడర్ రాకేష్ శర్మ.
ఈ క్రమంలో చేరినటువంటిదే ఈ పక్షిపిల్ల.....
ఇది రోదసీలో పుట్టిన మొట్టమొదటి ప్రాణి....

శాస్త్ర విజ్ఞానం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్నది. మానవుడు పొరుగు గ్రహాలపైకి ప్రయాణం చేస్తున్నాడు. మొదట రోదసీలోకి కుక్క, కోతిలాంటి జంతువులను పంపించాడు. తర్వాత మానవుడే రోదసీలోకి వెళ్ళాడు. అలా... అలా... విజయపతాకాలను చేత పట్టుకుని చంద్రుని పైకి వెళ్ళాడు. చంద్రుడిని అధిగమించి ఇప్పుడు గురు గ్రహానికి పయనం కడుతున్నాడు. ఇంకా రోదసీలో ఇల్లు కట్టడం, పరిశ్రమలు స్థాపించడం, కూరగాయలు పండించడం వంటి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే సోవియట్ శాస్త్రవేత్తలు రోదసీలో కౌజుపిట్ట గుడ్లను పొదిగించారు. తొలిసారిగా పక్షిపిల్ల రోదసీలో ప్రాణం పోసుకునేలా చేశారు.

ఒక రకమైన కౌజు పిట్ట యొక్క 48 గుడ్లను వ్యోమగాములతో పాటు రోదసీలోకి పంపించారు. వాటిని పొదుగుపెట్టె (ఇంక్యుబేటర్)లో పెట్టి కావలసిన వేడిమిని అందించారు. 17వ రోజున (మార్చి 22, 1990 సం॥న) గుడ్ల నుండి పిల్ల బయటికి వచ్చింది. అలా ఆరు గుడ్లు నుంచి ఆరు పిల్లలు బయటికి వచ్చాయి. రెండు గుడ్ల నుంచి పిల్లలు బయటికి రాలేక పోయాయి. మిగతా గుడ్లు పిల్లలు కాలేదు. బయటికి వచ్చిన పిల్లలు చురుకుగా ఉన్నాయి. వాటి కోసమని ఏర్పాటు చేసిన చిన్న స్థలంలో తలతిప్పి దిక్కులు చూస్తూ తప్పటడుగులు వేస్తూ కనిపించాయి.

(బాల చెలిమి)



# మట్టి కుండను నేను!

మట్టి కుండను
నేను హాని చేయగలేను
ఫ్రీజ్ కన్నా మేలు
నేను ఉండిన చాలు

చల్లగ ఉంచుతాను
చక్కగ పని చేస్తాను
ఇంటిల్లిపాదికి
ఉపయోగపడుతాను

అనారోగ్యం రాదు
ఆరోగ్యమే పోదు
మట్టి కుండను నేను
మీ మేలు తలచేను

వట్టి మాటలు కాదు
మాయమంత్రం లేదు
అలనాడు నేనంటే
అభిమానమెంతో!!

ఆల్కలీన్ లక్షణాలు
నాలోన పుష్కలం
ఆహారంలో ఆమ్లత
తటస్థీకరిస్తాను

ఎండలో తిరిగి తిరిగి
వచ్చి నాలోని నీరు
త్రాగితే చాలు చాలు
వడ దెబ్బ గెలిచేరు

పేదోళ్ల నేస్తాన్ని
దీవించు హస్తాన్ని
భేదం లేదు లేదు
కాదులె నేను చేదు

ఎండాకాలంలో
అక్కడక్కడ ఉంటా!
ఇంటిలో చేరితే
చెప్పినట్లు వింటా!


చలివేంద్రాలలో!
నే కొలువు దీరుతా!
వచ్చిపోయే వారి
దాహం తీరుస్తా!

మట్టి రూపం
నాది సృష్టిలో సాటేది!
మానవ సేవలోన
తరించే గుణమున్నది



– గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు.
m : 9966414580

# గుడ్డి కోతి



అనగనగా ఒక కోతి తన కుటుంబాన్ని కోల్పోయింది. దానికి కళ్లు కనపడవు. అది గుడ్డి కోతి. దానికి చిన్నప్పటి నుండి కుటుంబం లేక పోవడంతో ఒక ఏనుగు పిల్ల తోడుండేది. ఇవి రెండు ప్రాణ స్నేహితులు. ఒకదానిని విడిచి ఒకటి ఉండలేవు. రోజు గుడ్డి కోతికి తినడానికి ఏనుగుపిల్ల ఏదైన తెచ్చేది. ఇలానే ఒకరోజు గుడ్డి కోతికి చాలా ఆకలి వేసింది. ఏనుగు పిల్ల కోతికి తినడానికి ఏమైనా తెద్దామని బయలుదేరింది. అక్కడ అది గుంతలో పడి వేటగాళ్లకు చిక్కిన జింకపిల్లను చూసింది. దానిని కాపాడా లనుకుంది. అలా ఇది ఈ పనిలో నిమగ్నమై పోయింది. కాని అక్కడ గుడ్డి కోతికి ఆకలి పెరిగిపోయింది. అప్పుడు అక్కడకి ఒక జిత్తులమారి నక్క వచ్చింది. అది ఆ కోతిని తినాలి అనుకుంది కాని అది గుడ్డిది అని తెలిసి, దానిని తెలివిగా తినాలి అనుకుంది. నక్క కోతి దగ్గరకు వెళ్లి "మిత్రమా! నేను నీ ప్రాణస్నేహితుడు ఏనుగుకు తెలుసు. నీకు ఆకలిగా ఉంది కదా ఏమైనా తీసుకురా, అని నీ ప్రాణ స్నేహితుడు పంపించాడు" అని అన్నది. అప్పుడు భయపడుతూ "ఎవరు నువ్వు"అని అడిగింది. నక్క "అరే! చెప్పాను కదా!" అని అంది. కోతి "నిన్ను నా ప్రాణస్నేహితుడు ఏనుగునే పంపించాడు కదా, అలా అయితే, నాకు ఆకలిగా ఉంది. నాకు తినడానికి ఏమైనా తీసుకురా" అని అన్నది. అక్కడి నుంచి నక్క విషం తేడానికి బయలుదేరింది. చాలా సేపు అయినా ఇంక ఏనుగు, నక్క ఎవ్వరు రాలేదు. ఆ గుడ్డికోతి దగ్గరకు ఒక కప్పలగుంపు వచ్చింది. అందులో రాజుకప్ప కోతిని "ఈరోజు బయటనే తిరుగుతున్నావు" అని అన్నది. కోతి "కప్ప! నువ్వా, నాకు చాలా ఆకలిగా ఉంది. ఏనుగు మరియు నక్క నాకు ఏమైనా తేవాలని వెళ్లారు. కాని వాళ్లు ఇంక రాలేదు". అని అన్నది. కప్పగుంపులో ఉన్నవాళ్లందరు "అయ్యో" అని అన్నారు.

కోతి "ఇప్పుడు నాకు ఆకలి కన్న దాహం

ఎక్కువగా ఉంది. నాకు కొన్ని నీళ్లు ఇవ్వగలరా" అని అడిగింది. ఆ కప్పలు అన్ని ఒక ఆకులో నీళ్లు తెచ్చి కోతికి ఇచ్చే లోపే జిత్తులమారి నక్క ఒక ఆకులో విషం పెట్టుకొని వచ్చింది. కోతి "నక్క నువ్వా, నాకు ఏం తెచ్చావు" అని అడిగింది. నక్క "నేను నీకు ఈ పవిత్రమైన నీళ్లు తెచ్చాను. ఇవి త్రాగితే ఆకలి మాయమై పోతుంది" అని అన్నది. అంతలో ఏనుగు జింకను కాపాడి, ఒక అరటి గెలతో, వచ్చేసింది. కాని నక్క త్వరగా పరిగెత్తుతు రావడం వల్ల అది ఇంకా ఆయాస పడుతూనే ఉన్నది. ఆ ధ్వని విన్న కోతి విషం ఉన్న ఆకుని తీసుకొని "నీళ్లు తాగు నక్క మిత్రమా" అని అన్నది. నక్కకి దాహం ఎక్కువగా ఉండడంతో, విషం నీటిని మొత్తం ఒక్కసారిగా తాగేసింది. అది అరిచి అరిచి చావుచచ్చింది. ఏనుగు ఆ విషాన్ని ఆ నక్కను చూసి భయపడి పోయి, "కోతి"! నక్క నిన్ను చంపి తినాలని విషం తెచ్చింది". అని అన్నది. కోతి, "అది నన్ను చంపాలనుకుంటే నాకు తినడానికి తెస్తాను అని ఎందుకంటుంది నక్క నా మిత్రుడు. అతనికి ఏమైంది" అని అడిగింది. ఏనుగు "నక్క చనిపోయింది" అనడంతో కోతి చాలా బాధపడింది.

ఇలా నక్క ఆ కోతిని చంపాలనుకున్న ఆ గుడ్డి కోతి ఇప్పటికి ఆ నక్కను నమ్ముతూనే ఉన్నది.

– కె. శ్రీకాంత్‌నాయక్

8వ తరగతి, ఎం.వి. రామన్ స్కూల్, ఆత్మకూరు.

# బాల సాహిత్య సమ్మేళనం 2024

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మే 29,30 తేదీల్లో హైదరాబాదులో బాల సాహిత్య సమ్మేళనం జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు, బాల సాహితీ వేత్తలు, బాలల కోసం రచనలు చేస్తున్నవారు పాల్గొంటారని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో తెలుగు భాషావికాసం, బడి పిల్లల్లో రచనాభిరుచి పెంపొందించడం, పత్రికల్లో బాలల రచనలకు ప్రచురణావకాశాలు, కథలు చెప్పడంలో మెలకువలు, సంగీతం, నృత్యం, నాటకం, చిత్ర లేఖనం, శిల్పం వంటి లలిత కళల పైన ప్రాథమిక అవగాహన మొదలైన సదస్సులు, గోష్టులు జరుగుతాయని తెలిపారు. శాంతా వసంతా ట్రస్టు వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కే. ఐ. వరప్రసాద రెడ్డి వారి మాతృమూర్తి శాంతమ్మ గారి సంస్మరణార్థం గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక సౌజన్యం అందిస్తున్నారని శివారెడ్డి, చెన్నయ్య వివరించారు. అలాగే భాషాసాహిత్య వైభవం, బాల సారస్వతం పిల్లల కథల పుస్తకాలు ఆవిష్కరణ వంటి వివిధ కార్యక్రమాలుంటాయి.



# స్వర్ణ పుష్పాలు



ఒక అడవిలో రెండు లేడి పిల్లలు జంటగా తిరుగుతూ ఎంతో స్నేహంగా వుండేవి. ఒక రోజు రెండూ ఆడుకుంటూ ఆడుకుంటూ తమ మందకు చాలా దూరంగా పోయాయి. చీకటి పడి పోయింది. తిరిగి తమ మందను చేరుకోవాలంటే వాటికి దారి తెలియదు. రెండూ చీకట్లో భయ పడుతూ సింహాలు, పులుల గాండ్రింపు లతో వణుకుతూ దగ్గర్లో ఉన్న ఒక గుహలోకి ఎలాగో వెళ్ళి తల దాచు కున్నాయి. కొంతసేపటికి గుహలోకి ఎవరో వస్తున్న అలికిడైంది. రెండూ ఒక రాతి వెనుకనక్కాయి. ఒక మాంత్రికుడు లోపలికి వచ్చి తన చేతిలో మెరుస్తున్న స్వర్ణ పుష్పాన్ని తెచ్చి అక్కడున్న కాళీమాత విగ్రహం ముందుంచి పూజ చేసి వెళ్ళిపోయాడు. ఉదయాన్నే జింకలు ఆ స్వర్ణ పుష్పాన్ని తీసుకొని తమ మందను చేరుకున్నాయి. ఆ రాత్రి పున్నమి వెలుగుల్లో స్వర్ణ పుష్పం నుంచి వింత కాంతి వచ్చింది. ఆ పుష్పం ఒక దేవ కన్యగా మారిపోయింది. ఆమె జింకలకు తనను మాంత్రికుని నుంచి కాపాడినందుకు ధన్యవాదాలు చెప్పి వాటిని అందమైన అబ్బాయిలుగా మార్చి వెళ్ళింది.

ఆ రాజ్యపు రాజు వేటకు వచ్చి విశ్రాంతి తీసుకుంటుండగా ఆడుకుంటూ లేడి పిల్లలా గంతులేస్తూ కనిపించిన ఇద్దరు అబ్బాయిలూ ఆకట్టుకున్నారు. అసలే పిల్లలు లేక బాధపడ్తున్న రాజు ఇద్దరినీ తనతో తీసుకువెళ్ళి. అన్ని విద్యలు నేర్పించి పెద్దవాళ్ళను చేశాడు. కొన్నాళ్ళకు రాజ్యంలోని పిల్లలను, కన్యలను ఒక మాంత్రికుడు మంత్ర శక్తితో మాయం చేసి తీసుకెళ్ళి అమావాస్య, పున్నమి రోజుల్లో బలి ఇవ్వసాగాడు. మాంత్రికుడి ఆగడాలకు రాజ్యంలో

గగ్గోలు మొదలైంది. ప్రజలంతా రాజుగారి కోటకు వచ్చి తమను రక్షించవలసిందిగా వేడుకోసాగారు. వృద్ధుడైన రాజు నిస్సహాయుడై వుండగా, అనుమతిస్తే మాంత్రికుడ్ని తాము మట్టు పెడతామని ముందుకు వచ్చారు ఇద్దరు అబ్బాయిలు. రాజుగారు వారిని ఆశీర్వదించి పంపారు.

ఇద్దరు బయలుదేరి జింకలుగా ఉన్నప్పుడు తాము వెళ్ళిన గుహలోపలికి వెళ్ళారు. అక్కడ కాళీమాత ముందు మరో స్వర్ణ పుష్పం కనిపించింది. దాన్ని తీసుకుని గుహ వెలుపలికి తేగానే మరో దేవకన్య ప్రత్యక్షమైంది. ఈ మాంత్రికుడు దేవకన్యలను, మనుషులను హింసిస్తున్నాడు. అమాయకులను బలిస్తున్నాడు.

అతన్ని అంతం చేయాలంటే 108 స్వర్ణ పుష్పాలతో కాళీమాతను పూజించి వాటిని హోమగుండంలో ఆహుతి చేయాలి. అలా చేస్తే వాడు ఉన్న చోటునే కాలి బూడిదైపోతాడు. అని ఆ దేవకన్య చెప్పింది. తన మంత్ర మహిమతో 108 పుష్పాలను సృష్టించి వారికి ఇచ్చి మాయమైంది.

వెంటనే ఇద్దరూ లోపలికి వెళ్ళి కాళీమాతను పూజించి, దేవకన్య తమకు ఇచ్చిన స్వర్ణ పుష్పాలను హోమగుండంలో పడవేసారు. అదే సమయంలో తన శక్తుల సహాయంతో సముద్రం మీదుగా గాల్లో ఎగురుతూ వెళ్తున్న మాంత్రికుడు బూడిదై సముద్రం లోనే కలిసిపోయాడు.

ఇద్దరు అబ్బాయిలు సాధించిన విజయంతో రాజు ఆనందించి ఒకరిని రాజుగా, మరొకరిని సర్వసైన్యాధ్యక్షునిగా చేసి శేష జీవితం హాయిగా గడిపాడు.

– బి.పల్లవి
10వ తరగతి, జెడ్.పి.హెచ్.ఎస్.
బాలిక పాఠశాల, షాబాద్.







కథ, కార్టూన్ : వడ్డేపల్లి వెంకటేశ్, m : 9989596554




# మంథని దగ్గర మరో అజంతా

విష్ణుకుండులు తెలంగాణా ప్రాంతాన్నంతటినీ పరిపాలించారు. కాబట్టి వీరి రాజ్యంలో గోదావరి తీరంలోని రామగిరి కోట, మంథని ప్రాంతాలు కూడా ఉండేవి. రామగిరి కోటపైన మాధవవర్మ కట్టించిన మాధవీ మంటపం, గుహా రామలింగేశ్వర ఆలయం చూడదగినవి. ఇక తెలుగు ప్రజలకు కూడా తెలియని విష్ణుకుండుల నాటి శివాలయాలు మంథని దగ్గరి గోదావరి నదిలోని లంజమడుగు పైన ఉన్నాయి.

ఇక్కడ తూర్పు వైపు ప్రవహిస్తున్న గోదావరి అకస్మాత్తుగా ఉత్తరం వైపు తిరిగి ఒక ఎత్తైన గుట్టను వేగంగా గుద్దుకొని మళ్లీ వెంటనే తూర్పు వైపు తిరగడంతో దాని దాటికి ఆ ప్రాంతంలో ఒక పెద్ద లోతైన మడుగు ఏర్పడింది. ఈ మడుగును ఆనుకొని ఉన్న నిటారైన గుట్ట అంచున 200 అడుగుల ఎత్తున కొన్ని గుహాలయాల సముదాయము ఉంది. ఈ గుహాలయాలు ఐదు కావడంతో, వీటిల్లో శివలింగాలు ఉండడంతో ఇవి నిజానికి పంచ లింగాలయాలని, వీటి వాస్తు శిల్పరీతులు క్రీ.శ. 5వ శతాబ్దం ప్రాంతానివి కావడంతో వీటిని విష్ణుకుండి రాజులే కట్టించారని చెప్పవచ్చు. వీటి నీడ ప్రతిబింబాలు కిందుగా ప్రవహిస్తున్న గోదావరి ప్రవాహంలో అందంగా కనిపిస్తాయి. ఈ దృశ్యం అజంతా కంటే అందమైనది. మడుగులో చేసే పడవ ప్రయాణం పక్కనున్న గుట్టలు, పచ్చని అడవుల మధ్య సాగుతూ మనకు కేరళ అందాలను గుర్తుకు తెస్తాయి.

- డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 94909 57078

# గ్లాసును లేవనెత్తిన మంట




ఈ గారడీ చేయడానికి కావలసిన వస్తువులు : ఒకే సైజులో ఉన్న రెండు గాజు గ్లాసులు, అద్దుడు కాగితం, అగ్గిపెట్టె, పాత కాగితం ముక్క.

గాజు గ్లాసుల మూతికన్నా మరో అరంగుళం పెద్ద సైజులో అద్దుడు కాగితం నుంచి ఒక చక్రంలాగ కత్తిరించు. గ్లాసుల మూతికన్న కాస్త చిన్నదిగా ఉండేలాగ ఆ చక్రం మధ్యలో చిల్లులాగ కత్తిరించు, ఒక గ్లాసును బల్లమీద ఉంచు. అద్దుడు కాగితపు రింగును నీళ్లతో తడిపి, ఆ గ్లాసు మూతి మీద ఉంచు. కాగితాన్ని వెలిగించి, మంటతో సహా ఆ గ్లాసులో పడవేసి, వెంటనే రెండో గ్లాసును మొదటి గ్లాసు మూతిమీద (అద్దుడు కాగితపు రింగు మీద) అంచులు సరిగ్గా ఆనుకునే లాగా బోర్లించు. ఆ కాగితం కాస్త సేపు మండి ఆరిపోతుంది. ఇప్పుడు పైగ్లాసును పట్టుకుని ఎత్తితే కిందనున్న గ్లాసుకూడా పైకి లేచివస్తుంది!

దీనికి కారణం ఏమిటో తెలిసిందా?

మంట మండడానికి ఆక్సిజన్ అవసరం. మన చుట్టూ ఉన్న గాలిలో నాలుగు వంతులు నైట్రోజన్, ఒక వంతు అక్సిజన్ ఉన్నాయి. గ్లాసుల్లో ఉన్న ఆక్సిజన్ అంతా పూర్తి అయిపోయే వరకూ కాగితం మండి, తరవాత ఆరిపోతుంది. అంటే ఆ రెండు గ్లాసులు మధ్యనున్న చోటులో ఐదోవంతు ఖాళీ అయింది. ఆ ఖాళీని ఆక్రమించు కోడానికి వత్తిడి ఎక్కువగా ఉన్న బయటి గాలి శతవిధాల ప్రయత్నిస్తుంది. కాని, లోపలికి చొరబడడానికి దారి లేదు. తడిసిన అద్దుడు కాగితపు రింగు రంధ్రాల నన్నిటినీ చక్కగా మూసేసి, 'సీలు' లాగ పని చేస్తుంది. అన్ని వైపుల నుంచీ బయటి గాలి నొక్కుతూ ఉండడం వల్ల రెండు గ్లాసులూ అతుక్కుని ఉండిపోతాయి. సీలు సరిగ్గా పని చేస్తున్నంత కాలం ఈ విధంగా గ్లాసులు అతుక్కునే ఉంటాయి.

బల్లి, ఉడుము వంటి జంతువులు గోడలని పట్టుకుని వేలాడుతూ ఉండ గలగడానికి ఇదే కారణం. ఈ జంతువుల అరిపాదాల కింద గాలిలేని శూన్య ప్రదేశం తయారయే ఏర్పాటు ఉంది. ఆ శూన్య ప్రదేశంలో చొరబడడానికి ప్రయత్నించే బయటి గాలే ఆ జంతువుల పాదాలను గోడలకి నొక్కి ఉంచుతుంది. అయితే ఒక్క సందేహం ఎంత బరువున్న గ్లాసులను గాలివత్తిడి ఈ విధంగా ఎత్తగలుగుతుంది?

భూమి మీద గాలి వత్తిడి చదరపు సెంటీమీటరుకి సుమారు ఒక కిలో ఉంటుంది. కాని, గ్లాసుల లోపల 1/5వ వంతు మాత్రమే ఖాళీ అయింది కాబట్టి లోపలికి నొక్కే వత్తిడి చ.సెం.మీ.కి 1/5 కిలో మాత్రమే. రెండు గ్లాసుల మొత్తం ఉపరితల వైశాల్యం 100 చ.సెం.మీ. అనుకుంటే – సీలుసరిగ్గా ఉంటే – సుమారు 20 కిలోల బరువును ఎత్తగలుగుతుంది!

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.



### చెలిమి క్లబ్

మెంబర్ షిప్ నెం. : ---------------

పేరు : ----------------------

తండ్రి పేరు : ----------------------

తరగతి : ----------------------

పుట్టినతేదీ : ----------------------

హాబీలు : ----------------------

చిరునామా : ----------------------

----------------------

----------------------

పిన్ : ----------------------

ఇ-మెయిల్ : ---------------------- -

ఈ వివరాలతో మెయిల్ చేయండి.


బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com



# ఇంట్లో తోట : ఆరోగ్యాల పంట

“ఆదివారం సెలవు రోజు కావడంతో కమల్ టివి చూస్తున్నాడు. కూరగాయల మొక్కల పైన రసాయనాలను పిచికారి చేస్తున్నారని, వాటి నుండి వచ్చే కాయగూరలను మనం తినడం వలన మనిషి జీర్ణ వ్యవస్థ పైన తీవ్ర ప్రభావం చూపుతుంది. కాబట్టి సేంద్రియ పద్ధతిలో అందించిన కూరగాయలను వాడినట్లయితే ఆరోగ్యంగా ఉంటారని” టీవీలో వచ్చిన వార్తను చూశాడు కమల్. తీవ్రంగా ఆలోచించాడు. వెంటనే తన అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి తాతయ్య దగ్గరికి వెళ్లి టీవీలో వచ్చిన వార్త గురించి చెప్పాడు.

తాతయ్య “ఒరేయ్ కమల్ నిజమే మోతాదుకు మించి రసాయనాలు చల్లడం ద్వారా చెట్లు వాటిని పీల్చుకొని మనకు అందించిన వాటి ఫలాలు కాయ గూరలను మనం తినడం వలన మన శరీరంలోకి ప్రవేశించిన రసాయనాలతో అంతుచిక్కని రోగాలు రావడం పరిపాటి అయింది. ముఖ్యంగా నరాల బలహీనత వెంట్రుకలు పండిపోవడం కాళ్లు చేతులు విపరీతంగా లాగడం ఈ మధ్య చాలా ఎక్కువ



అయ్యాయి ఒకప్పుడు మేము ఎలాంటి రసాయనాలు చల్లకుండా వ్యవసాయాన్ని చేసేవాళ్ళం. అప్పుడు అందరం చాలా ఆరోగ్యంగా ఉండే వాళ్ళం. కానీ ఇప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చింది” అని చెప్పగానే కమల్ ఒక ఉపాయాన్ని ఆలోచించాడు, తాతయ్యకు తన ఉపాయం చెప్పగానే తాతయ్య సరేనన్నాడు.

తన ఇంటి పరిసరాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని చదును చేసి, రెండు మడులను సిద్ధం చేశాడు. రకరకాల కూరగాయల విత్తనాలను చల్లాడు. అందులో పశువుల పేడ, మేక పెంట, ఇంట్లో వ్యర్థ పదార్థాలను కుళ్ల పెట్టీ, తద్వారా వచ్చిన ఎరువును మడులలో చల్లాడు. ఇంట్లో నుండి వచ్చే వ్యర్థమైన నీటిని కాలువ ద్వార మళ్ళించాడు. వారం రోజుల్లో విత్తనాలు మొలకెత్తాయి. ఇది చూసిన కమల్ చాలా సంతోషించాడు.

ఇరవై రోజుల్లో రకరకాల ఆకుకూరలు కాయగూరలు తెంపి వాళ్ళ అమ్మకు అందించే వాడు. చక్కటి రుచికరమైన తాజా కూరగాయల రోజు వలన వారి కుటుంబ సభ్యులందరికీ కూడా ఆరోగ్యంగా ఉన్నారు. ఇదే విషయాన్ని పాఠశాలలో ఉపాధ్యాయులతో తన స్నేహితులతో చెప్పాడు. వారందరూ కూడా కమల్ మాదిరిగానే “మన ఇంటి దగ్గర ఉన్న ఖాళీ ప్రదేశంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కమల్ చేసిన మంచి పనికి వాళ్ల తాతయ్య అభినందించాడు.

**నీతి: రసాయనాలు వాడ వద్దు, సేంద్రీయ ఎరువులే ముద్దు.**

– యాడవరం చంద్రకాంత్ గౌడ్
m : 94417 62105

## బాల బంధువు తెలంగాణ బాలోత్సవం




తెలంగాణ బాలోత్సవం” ఉచిత సమ్మర్ క్యాంపును మే 5వ తేదీ నుండి మే నెల 22 వరకు నిర్వహించబోతుంది. ప్రతి పిల్లవాడి లోనూ సృజనాత్మకత దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి వెలికి తీయడమే తెలంగాణ బాలోత్సవం ప్రధాన లక్ష్యం. పిల్లలలో విజ్ఞాన శాస్త్ర, సామాజిక పర్యావరణ, ప్రయోగం నైపుణ్యాలు, ప్రకృతి పాఠాలు, మానవ సంబంధాలు పెంపొందించటం అవసరం. ఎలా నేర్చుకోవాలి? స్నేహితులను ఎలా సంపాదించుకోవాలి? సెల్‌ఫోనుకు ఎంత దూరం ఉండాలి? అనేక విషయాలు ఈ సమ్మర్ క్యాంపులో నేర్పించబోతున్నారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు ఒకరిని అనుకరించడం కాకుండా పిల్లల శక్తిని తనకుతాను తెలుసుకోనే రీతిగా తీర్చిదిద్దడం మా ముఖ్య ఉద్దేశమని, ఆంగ్ల భాష మోజులో పడి తెలుగు మరిచిపోతున్న ఈ తరానికి తెలుగు మాధుర్యాన్ని పంచే బాధ్యత అమ్మదనాన్ని తెలుగుదనాన్ని తెలంగాణ బాలోత్సవం నేర్పించబోతుందన్నారు. మే 22న పిల్లలు నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రతిభోత్సవం పేరుతో ప్రదర్శనఉండబోతుంది. ప్రతి పిల్లవాడు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎన్ సోమయ్య, ఉపాధ్యక్షులు మమత, కే.సుజావతి, జి బుచ్చిరెడ్డి, చంద్రయ్య తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు.

## 1. తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారానికి ఎంపికైన ఎన్నవెళ్ళి రాజమౌళి



29.04.2024: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022 సంవత్సరానికి గాను ప్రకటించిన సాహితీ పురస్కారాలలో భాగంగా సిద్దిపేటకు చెందిన కథల తాతయ్య, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఎన్నవెళ్ళి రాజమౌళి రచించిన ఆటపాట కథల సంపుటి బాలసాహిత్య విభాగంలో సాహితీ పురస్కారానికి ఎంపిక కావడం జరిగింది.



బాల సాహిత్యంలో గత నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న కృషికి గాను ఇట్టి పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో రాజమౌళి సుమారు పది పుస్తకాల వరకు బాలసాహిత్యంలో ప్రచురించడం జరిగింది. గతంలో బాల సాహిత్యంలో తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం సిద్దిపేటకు చెందిన వారిలో మొదటగా సామలేటి లింగమూర్తి అందుకోవడం జరిగింది. ఇప్పుడు రెండవసారి రాజమౌళికి లభించడం సిద్దిపేట బాలసాహిత్య కృషికి తార్కాణమని సిద్దిపేట బాలసాహిత్య రచయితలు తెలిపారు. రాజమౌళి బాలసాహిత్య పురస్కారానికి ఎంపిక కావడం పట్ల కవులు ఐతా చంద్రయ్య, ఉండ్రాళ్ళ రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, గరిపల్లి అశోక్, క్రాంతికృష్ణ, నరసింహారావు, బస్వ రాజ్ కుమార్, తిరుపతి, చిరంజీవి, రామానుజ, నిర్మల, అనురాధ, లక్ష్మీ, చంద్రకాంత్, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు అభినందనలు తెలియ జేశారు. **– ఉండ్రాళ్ల రాజేశం,** m : 9966946084

## 2. ఘనంగా జరిగిన పున్నాగ పూలు పుస్తకావిష్కరణ

తేదీ 2.4.2024 మంగళవారం నాడు కోండ్రు బ్రహ్మం బాల సాహిత్య వేదిక కన్వీనర్, ఖమ్మం గారి సంపాదకత్వంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల NSC కాలనీ బాలబాలికలచే రాయబడిన కథల సంకలనం పున్నాగ పూలు పిల్లల కథల పుస్తకం గౌరవ నీయులైన జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.






సోమశేఖర శర్మ గారి చేతుల మీదుగా ఆవిష్కరణ ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా DEO గారు మాట్లాడారు పిల్లల్లో దాగిన సృజనను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి, ఖమ్మం జిల్లాలో ఇటీవల ఈ కృషి విస్తృతంగా జరుగుతుంది. ప్రపంచ పిల్లల పుస్తక దినోత్సవం ఈ రోజు. ఈ రోజు ఆవిష్కరణ జరగడం గొప్ప విషయం. కథలంటే పిల్లలకు చాలా ఇష్టం ఇందులో వారి ఊహాశక్తి అద్భుతంగా ఉందన్నారు. 39 మంది బాలబాలికలు కథలు రాయడం సంతోషంగా ఉందన్నారు గతంలో తొలుత కవిత్వ సంకలనం తొలిజల్లు ఇప్పుడు కథల సంకలనం పున్నాగ పూలు రావడం చాలా హర్షనీయమన్నారు. మరిన్ని సంకలనాలు ఈ పాఠశాల నుండి రావాలని ఆశిస్తూ పిల్లలకు శుభాకాంక్షలు అన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుస్తకదాత శ్రీ శంకర రావు గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని శ్రీ కన్నెగంటి వెంకటయ్య గారు సమీక్ష చేశారు.

**– కోండ్రు బ్రహ్మం,** m : 9949459409

## 3. నేటి సమాజానికి బాల సాహిత్యం అవసరం

16.04.2024: మారుతున్న సమాజములో తెలుగు భాష పరిరక్షణ కోసం తెలుగు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి గొప్పదని, సాహిత్యాభిరుచి గల వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు ఎక్కువ గా ఉంటాయని, తెలుగు భాష కున్న మాధుర్యం గొప్పదని, విద్యార్థులలో సృజనాత్మకతకు మెరుగులు దిద్దుతున్న సుగుణ సాహితి సేవ ప్రశంసనీయమని సిద్దిపేట మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డి అన్నారు. మంగళ వారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జరిగిన సుగుణ సాహితీ సమితి ఉగాది బాలల కథల పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుగుణ సాహితి




సమితి కన్వీనర్ భైతి దుర్గయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో 20 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందచేశారు. విద్యార్థులను కథలు వ్రాసేలా ప్రోత్సాహించిన 23 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి సయ్యద్ షౌకత్ అలీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మర్పడగ చెన్నకృష్ణా రెడ్డి, బాల సాహితి వేత్త సంఘనభట్ల చిన రామ కిష్టయ్య, కవి కొమురవెల్లి అంజయ్య, రచయిత పర్కపెల్లి యాదగిరి, కవి వేల్పుల రాజు, సాహితీ వేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. సుమారు నాలుగు గంటలు సాగిన ఈ సభ విద్యార్థులకు ప్రేరణను అందించిందని తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పేర్కొన్నారు. **– భైతి దుర్గయ్య,** m : 9959007914

## 4. ఆదిలాబాద్ జిల్లా. గుడిహత్నూర్ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మన్నూరు.

22.04.2024: గ్రామంలోని విద్యార్థులు 5 భాషల్లో ఐదు బాలగేయ పుస్తకాలు, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, గోండి, భాషల్లో శ్రీమతి అరుణ బట్టువార్, గారి సంపాదకత్వంలో, ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవంను పురస్కరించు కొని, ఒక రోజు మునుపు అనగా సోమవారం 22, ఏప్రిల్ 2024న ఈ ఐదు పుస్తకాల ఆవిష్కరణ మహోత్సవం జరిగింది. ఈ పుస్తకావిష్కరణ మహోత్సవానికి ఆదిలాబాద్ జిల్లా విద్యాధికారిణి శ్రీమతి ప్రణీత మేడం గారు మరియు మండల విద్యాధికారి ఆర్ నారాయణ, గారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగాజి సంతోష్ కుమార్ గార్ల చేతుల






మీదుగా, ఊరు ఊరంత ఏకమై 600 విద్యార్థులు, 20 మంది ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు అంతా మమేకమై అంగరంగ వైభవోపేతంగా పుస్తకావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత మేడం గారు మాట్లాడుతూ, శ్రీమతి అరుణ బట్టువార్ గారిని, తనకున్న సాహితీ పిపాసకు, విద్యార్థులను బాల రచయితలుగా. సమాజంలోకి తీసుకురావాలనే ఆరాటం తపన చూస్తుంటే తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ రోజుల్లో ఇలాంటి ఉపాధ్యాయులు ఉండటం చాలా అరుదు అన్నారు.

విద్యార్థుల కొరకై పుస్తకాలు ముద్రించి పిల్లలను బాల మేధావులుగా సమాజంలోకి, ఇలా ఐదు భాషల్లో తీసుకొని రావడం, కని విని ఎరుగని అద్భుతమని, ఇది జిల్లాకే కాదు మన రాష్ట్రానికే గర్వకారణమని అలాగే మరాఠీ భాష పుస్తకానికి ముందు మాట రాసే అదృష్టం తనకు దక్కినందుకు అరుణ ముున్ముందు ఇంకా ఎందరెందరినో బాల రచయితలుగా తీర్చిదిద్దాలని, మనస్ఫూర్తిగా ఆనందాన్ని వ్యక్తం చేసారు.

ఇప్పటి వరకు ఏ పాఠశాలలో ముద్రించని ఐదు భాషల్లో పుస్తకాలు మా మండలంలోని విద్యార్థులు రాయడం. మాకెంతో ఆనందదాయకం అన్నారు. మండల విద్యాధికారిగా తనకెంతో గర్వకారణంగా ఉందని అన్నారు.

అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగాజీ సంతోష్ కుమార్ గారు. తన ఆనందానికి హద్దే లేదని శ్రీమతి అరుణ బట్టు వార్. గారని, ఇలాంటి ఉపాధ్యాయులు పుట్టుకొస్తే ఎందరెందరో బాల రచయితలని సమాజానికి పరిచయం చేస్తారని.. ఇలాంటి ఉపాధ్యాయురాలు తమ పాఠశాలలో

ఉండడం మా విద్యార్థుల ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నారు. **– అరుణ బట్టువార్,** m : 9963806368

## 5. 23-04-2024 లిదమ్మపేట మండలం నాగుపల్లి ఉన్నత పాఠశాల, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా

- సామాజిక అంశాలే ఇతివృత్తాలుగా బాల సాహిత్య రచన
- నాగుపల్లి ఉన్నత పాఠశాలలో నాలుగు పిల్లల పుస్తకాల ఆవిష్కరణ
- పిల్లలే ఆవిష్కరించుకున్న పుస్తకం "సమీక్షల సమాహారం.
- తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో నమోదు. అవార్డు బహూకరణ.

తెలుగు బాల సాహిత్య చరిత్రలో ఒక అద్భుతమైన ఘట్టం మంగళవారం దమ్మపేట మండలం లోని నాగుపల్లి ఉన్నత పాఠశాలలో ఆవిష్కృతమైంది. పిల్లలు రాసిన నాలుగు బాలసాహిత్య పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. నాగుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బజ్జూరి సరళ అధ్యక్షతన తెలుగు ఉపాధ్యాయిని, కవయిత్రి ఉరిమళ్ళ సునంద ఆధ్వర్యంలో నవీన కథావనం పుస్తకాన్ని మండల విద్యాధికారి కె. లక్ష్మి, నాగుపల్లి కథా కదంబం పుస్తకాన్ని బజ్జూరి సరళ, పెద్దయ్యాక పుస్తకాన్ని తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సిఇఓ. బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. నాలుగో పుస్తకమైన సమీక్షల సమాహారాన్ని పాఠశాల విద్యార్థులే ఆవిష్కరించుకున్నారు.

అనంతరం జరిగిన సమావేశంలో అతిథులుగా పాల్గొన్న పలువురు సాహితీ వేత్తలు మాట్లాడుతూ బాలసాహిత్యంలో




వస్తున్న ఆధునిక మార్పు నాలుగు పుస్తకాలలో కనిపించిందని అన్నారు. సమాజాన్ని పిల్లలు నిశితంగా పరిశీలించి కథలుగా మలచడం విశేషమని అన్నారు. నాగుపల్లి పదవ తరగతి విద్యార్థిని సాయి నవీన ఒక్కరే ఇరవై కథలు రాయగా వాటిని ఉరిమళ్ళ సునంద పుస్తక రూపంలో తెచ్చారని అభినందించారు.

ఇవన్నీ బాల సాహిత్య చరిత్రలో మరపురాని ఘట్టంగా నిలచి పోతాయని దమ్మపేట మండల విద్యాధికారి కె. లక్ష్మి అన్నారు. సమావేశంలో సాహితీ వేత్తలు నామా పురుషోత్తం, రాచమళ్ళ ఉపేందర్ బి. మధుసూదన రాజు మాట్లాడారు.

## తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు

తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నాగుపల్లి ఉన్నత పాఠశాల నమోదు అయింది. ఆ సంస్థ వ్యవస్థాపక




చైర్మన్ చింతపట్ల వెంకటాచారి పాఠశాల గురించి తెలుసుకొని ప్రత్యేక ప్రశంసాపత్రం పంపగా సియిఓ. బొమ్మారెడ్డి శ్రీనివాస రెడ్డి మంగళవారం ఆ సంస్థ తరపున ఉరిమళ్ళ సునంద, ఉపేందర్ దంపతులకు అందచేసి సత్కరించారు. ఏడాది వ్యవధిలోనే ఏడు పిల్లల పుస్తకాలను ప్రచురించి ఒక ప్రభుత్వ పాఠశాల వేదికగా ఆవిష్కరించు కోవడం అభినందనీయమని సిఈఓ బొమ్మారెడ్డి శ్రీనివాస రెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మధుసూదన రాజు అన్నారు.

చివరగా ఉరిమళ్ళ సునంద మాట్లాడుతూ పిల్లలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రతిభ గలవారికి ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిధులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**– ఉరిమళ్ళ సునంద,** m : 9441815722

## 6. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడపాకల్, మండలం ఏర్గట్ల, జిల్లా నిజామాబాద్, ఆవిష్కరించిన తేదీ 23/04/2024




**– డి. ప్రవీణ్‌శర్మ,** m : 9553576697

## గోవింద్‌పూర్‌లో విద్యార్థుల వేసవి విడిదిలో కథా కార్యశాల!





జహీరాబాద్ మండలంలో గోవింద్‌పూర్‌లో ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యా సంస్థలు (హైదరాబాద్) నెల రోజులకు పైగా నిర్వహించిన విద్యార్థుల వేసవి విడిది – శిక్షణా శిబిరంలో, తేది 22 ఏప్రిల్ 2024 నాడు బాల సాహితీవేత్త డా॥ వి.ఆర్. శర్మ పాల్గొని విద్యార్థులకు కథా రచనపై కార్యశాల నిర్వహించారు. "భాషా నైపుణ్యాలూ, జీవన నైపుణ్యాలూ వికసించడానికి కథలు ఎలా ఉపయోగ పడ్తాయి," అనే చర్చ పిల్లలతో జరిగింది. తరువాత "కథా రచనలో ఏయే అంశాలు ఉంటాయి?" అనే విషయాలను కొన్ని కథల ఉదాహరణల ద్వారా పిల్లలు గ్రహించారు. తరువాత, సాయంకాల సమయంలో అందమైన సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తూ, వంద మందికి పైగా పిల్లలు అక్కడి తోటలో, పచ్చని చెట్ల కింద కూర్చుని కథలు రాశారు. అనగనగా లాంటి కథలు కాకుండా – తమ జీవితాల్లోంచి, తమ చుట్టూ ఉన్న సమాజంలోంచి, పరిసరాల్లోంచి, పరిస్థితుల్లోంచి, తమకు తెలిసిన వ్యక్తులూ, సంఘటనల్లోంచి కథలు సృష్టించి రాసే ప్రయత్నం చేశారు. కొందరు భవిష్యత్తును ఊహిస్తూ రాశారు. ఈ కార్యక్రమం అంతా సరదాగా ఓ ఆటలాగా జరిగింది.

బాలచెలిమి, సాహిత్య అకాడమీ, సారస్వత పరిషత్తు, మంచి పుస్తకం ప్రచురించిన పిల్లల పుస్తకాలను వి.ఆర్.శర్మ ముగింపు కార్యక్రమంలో పిల్లలందరికీ జ్ఞాపికలుగా అందించారు.

## ప్రగతి చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిబిరం!






హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌లో పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ప్రగతి చిల్డ్రన్స్ క్లబ్ వారు పిల్లల కోసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని తేది–30 ఏప్రిల్ 2024 నుంచి – 9 మే 2024 వరకు, ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. కథలు విందాం– కథలు చెబుదాం, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, మీట్ ది సైంటిస్ట్, పాత ఆటలు– కొత్త ఆటలు... వంటి మరెన్నో అంశాలతో, బోలెడు కబుర్లతో ఈ కార్యక్రమం రూపొందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా॥ వి.ఆర్. శర్మ పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కథలు చెప్పిస్తూ, చెపుతూ, విశ్లేషింపజేస్తూ, వాటికి రకరకాల ముగింపులు ఊహించేలా ప్రోత్సహిస్తూ, పిల్లలతో వాళ్ళకు తెలిసిన పాత కథలను చెప్పిస్తూ, వాటికి మరిన్ని ముగింపులు చెప్పిస్తూ, ఆడిస్తూ, పాడిస్తూ ఆ కార్యక్రమం పట్ల పిల్లలకు ఆసక్తి, అవగాహనా కల్పించారు. కథల గురించి తమకు ఇప్పుడు కొత్త అవగాహన కలిగిందని పిల్లలు చెప్పారు. ఇలా ఆడుకుంటూ, పాడుకుంటూ కలిసి మెలిసి సరదాగా నేర్చుకునే అవకాశం కల్పించే ఈ కార్యక్రమం తమకు చాలా బాగుందని తాము చాలా విషయాలు నేర్చుకుంటామని సంతోషంగా మాట్లాడారు. బాలచెలిమి, సాహిత్య అకాడమీ, సారస్వత పరిషత్తు, మంచి పుస్తకం ప్రచురించిన పిల్లల పుస్తకాలను డా॥ వి.ఆర్. శర్మ ముగింపు కార్యక్రమంలో పిల్లలందరికీ జ్ఞాపికలుగా అందించారు.

– డా॥ వి.ఆర్.శర్మ, m : 9177887749





# బాలసాహిత్యానికి పచ్చని తివాచీ బాలచెలిమి

"పిల్లల్లారా పాపల్లారా రేపటి భారత పౌరుల్లారా పెద్దలకే దారిని చూపే పిన్నల్లారా" అని దాశరథి పాటలో చెప్పినట్లుగా పిల్లలే కదా! రేపటి సమాజ నిర్మాతలు. బాలల ఎదుగుదలే సమాజ దశ దిశలకు భూమిక. శారీరక, మానసిక, సామాజిక, సాంస్కృతిక అన్ని విషయాలలో బాలలు సమున్నతంగా ఎదగాలి. అందుకు బాల సాహిత్యమే కీలక పాత్రధారి. బాలల శ్రేయస్సే పరమావధిగా బాలసాహితీ సంపదను దశాబ్దాలుగా కూర్చుతున్న సంస్థ చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ. మణికొండ వేదకుమార్ ఈ సంస్థకు చైర్మన్.

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ 2018 నుండి 2020 సంవత్సరం, ప్రతి నెల రెండవ శనివారం 'బాలచెలిమి' ముచ్చట్లు నిర్వహించింది. ఆ కార్యక్రమాలలో వివిధ బాలసాహితీవేత్తలు, ఐ.టి తదితర రంగాలకు చెందిన సాంకేతిక శాస్త్ర నిపుణులు, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాలకు చెందిన నిష్ణాతులు అనేకులు తమ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ నేపథ్యంతో వాటన్నిటి ఫలితంగా పిల్లల పెంపకంలో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చక్కని మాధ్యమంగా ఉండాలన్న ఆశయంతో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ ఈ సంవత్సరం అనగా 2024, జనవరి నుండి బాలచెలిమి మాసపత్రికను పిల్లల వికాసం కోసం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం తేవడం ప్రాధాన్యమైన అంశం. నిజానికి చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ గత కొన్ని సంవత్సరాలుగా బాలల కోసం వివిధ సాహితీ కార్యక్రమాలు, వివిధ ప్రాంతాలలో గ్రంథాలయాల స్థాపన, బాలలకు, పెద్దలకు వివిధ సామాజిక అంశాలలో పోటీలు మరియు బాల సాహిత్య ముద్రణ తదితర విషయాలలో విశిష్టంగా కృషి చేస్తూ సాగుతున్నది. ఇందులో భాగంగానే బాలచెలిమి పిల్లల వికాస పత్రిక సంపాదకులు మణికొండ వేద కుమార్ గారి ఆధ్వర్యంలో మే నెల -2023 రోజున, పర్యావరణ కథల పోటీలను నిర్వహించారు. ఈ పోటీకి విద్యార్థుల నుంచి పెద్దల నుంచి విశేష స్పందన రావడం గమనార్హం. బాలలకు, పెద్దలకు ప్రత్యేకంగా నిర్వహించిన ఈ పోటీలలో ఎంపికైన కథలను బాలచెలిమి – చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ వారు విద్యార్థులు రాసిన కథలు, పెద్దలు రాసిన పిల్లల కథలుగా రెండు ప్రత్యేక కథా సంకలనాలను ముద్రించారు.

బాలచెలిమి జనవరి, ఫిబ్రవరి, మార్చి

సంచికలతో పాటు విద్యార్థులు రాసిన కథలు, పిల్లల కోసం పెద్దలు రాసిన కథా సంకలనాలను 05-04-2024న దక్కన్ ప్రెస్ అజామాబాద్ వేదికగా ఆవిష్కరించారు. ఇదే వేదికపై బాల చెలిమి ముద్రించిన 'కథల బడి' కరీంనగర్ జిల్లా, కేశవపట్నం – టి.ఎస్ మోడల్ స్కూల్ బడి పిల్లల కథా సంకలనం మరియు ఉండ్రాళ్ల రాజేశం సంపాదకత్వంలో సిద్దిపేట జిల్లా బడి పిల్లల కథా సంకలనం కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మణికొండ వేదకుమార్ బాలల బంధువు. బాల సాహిత్యానికి సేతువు. సాహితీ లోకానికి సుపరిచితులు. వారు మాట్లాడుతూ మారుతున్న విలువలు, సమాజంలో ఎప్పటికప్పుడు ఎదురయ్యే పరిణామాల పట్ల పిల్లల మనసుల్లో అవగాహన పెంచడం బాలసాహిత్యం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలిపారు. పెద్దల ఆలోచనలతో బాలసాహిత్యాన్ని సృజించడమే కాకుండా పిల్లల ఆలోచనలకు పెద్దపీట వేస్తూ పిల్లలు రచించిన సాహిత్యాన్ని కూడా పుస్తకాల రూపంలో తెస్తున్నామని తెలిపారు. చదువుకోడానికి పాఠ్యపుస్తకాలు మినహా ఇతర బాలసాహిత్యం అందుబాటులో లేని మారు మూల ప్రాంతాలలోని విద్యార్థులకు కూడా రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రపంచ జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందించి వారిని ఎవరికీ తీసిపోని విధంగా తయారు చేసే లక్ష్యంతో బాలచెలిమి బాలల వికాస పత్రికను ప్రారంభించిందని అన్నారు. బాల సాహితీవేత్తలు, రచయితలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొదలగు వారందరి సహకారం, భాగస్వామ్యం ఉండాలని చెప్పారు. అతి త్వరలో బాల సాహిత్య వర్క్ షాప్ వినూత్న పద్ధతిలో నిర్వహించ బడుతుందని కూడా తెలిపారు.

ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులు డా. ఎస్. రఘు నైతిక విలువల స్థాపనకు బాల సాహిత్యమే ప్రధానమని ఆ దిశగా పెద్దలతోనూ, పిల్లలతోనూ గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తూ, సృజనలు చేయిస్తూ చక్కని సంకలనాలను తెస్తున్న బాలచెలిమి – చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ సేవలు వట్టికోట ఆళ్వారు స్వామి సేవలను తలపిస్తున్నాయని కొనియాడారు. ప్రౌఢ సాహిత్య ప్రయాణం చేస్తున్న రచయితలు, కవులెందరో బాల సాహిత్యంవైపు కూడా పయనించేలా బాలచెలిమి – చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ఎకాడమీ స్ఫూర్తి నింపుతున్నదని తెలిపారు.

కార్యక్రమానికి హాజరైన అతిథుల జాబితాలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలైన డాక్టర్ భూపాల్, చొక్కాపు వెంకటరమణ, కన్నెగంటి అనసూయ, ప్రముఖ రచయిత చింతపట్ల సుదర్శన్‌లు ఉన్నారు. డాక్టర్ భూపాల్ కార్యక్రమాన్ని ఉద్దేశించి వేగంగా మార్పు చెందుతున్న నేటి వ్యవస్థలో పిల్లల ఆలోచనలకు అనుగుణమైన సాహిత్య సృజన జరగాలని, తద్వారా సామాజికోపయోగమైన వ్యక్తులుగా బాలలను తీర్చిదిద్దవచ్చునని తెలిపారు.










ఇదే లక్ష్యంతో బాలచెలిమి బాల సాహిత్య పరిపుష్టికి కృషి చేయడం గొప్ప విషయమని తెలిపారు.

బాల సాహితీవేత్త చొక్కాపు వెంకటరమణ మా పిల్లాడు తప్పిపోయాడు అంటూ వాట్సాప్‌లో చెక్కర్లు కొడుతున్న ఒక సమాచారం భూమికగా కథను చెప్తూ అందరినీ నవ్వించారు. టెక్నాలజీని కథల్లో ఇమడ్చి, పిల్లల్లో ఏవిధంగా ఆసక్తులను మంచి విలువలను పాదుకొల్పవచ్చో వివరించారు. మరో బాలసాహితీవేత్త కన్నెగంటి అనసూయ బాలల శ్రేయస్సుతో పాటు పర్యావరణం, సామాజిక సంస్కరణ లక్ష్యంగా బాలచెలిమి చేస్తున్న కృషి విశిష్టమైనదని తెలిపారు. నేటి రచయితలు బాలల ప్రవర్తనా విధానంలో వస్తున్న వివిధ మార్పులను దృష్టి యందు ఉంచుకొని బాల సాహిత్యాన్ని సృజించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

బాలల వికాసాన్ని ఎల్లప్పుడూ శ్వాసించే గరిపల్లి అశోక్ మాట్లాడుతూ చక్కటి పర్యావరణ కథలను రచించి, సమాజం పట్ల తమ బాధ్యతను నిలబెట్టుకున్న రచయితలను, బాల రచయితలను ప్రశంసించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆబాలగోపాలం పర్యావరణ స్పృహ కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను తెలిపారు. బాలల ఉన్నతి కోసం పరిశ్రమించే రచయితలకు బాలచెలిమి వంటి సంస్థల నుండి అందే సహకారం ప్రత్యేకమైనదని అన్నారు. మొలక పత్రిక సంపాదకులు వేదాంత సూరి బాలచెలిమి సమాజానికి మంచి సర్వీస్ అందిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ రచయితలు మరియు ఆర్టిస్టులు అయిన కె.వి. కృష్ణారావు, చెన్నూరి సుదర్శన్ లు బాల సాహిత్యాన్ని బాలలకు చేరువ చేయడం, వారిలో పఠనాసక్తిని పెంపొందించడం అందరి బాధ్యతగా తెలిపారు. బాల సాహితీవేత్త డాక్టర్ వి.ఆర్ శర్మ మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను, ప్రతిభా పాటవాలను వెలికి తీయటానికి బాల సాహిత్యమే మూలధనమని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమానికి హాజరైన బాలలు పుస్తకంగా వచ్చిన వారి కథలను చూసి మురిసిపోతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారి అభిప్రాయాలను అందరి ముందు పంచుకున్నారు.


విశేష సంఖ్యలో బాలసాహితీవేత్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పర్యావరణ కథల పోటీలలో ప్రతిభ కనబరిచిన రచయితలను, బాల రచయితలను బహుమతులతో సత్కరించారు. పర్యావరణ కథలు సంకలనాలుగా వెలుగు చూడడానికి ఎంతో శ్రమించిన గరిపల్లి అశోక్, బాల చెలిమి కోఆర్డినేటర్ సయ్యద్ ఖైజర్, చరిత ప్రెస్ సుదర్శన్, జుగాష్ విలీ, దక్కన్ ప్రెస్ సిబ్బంది అందరికీ సభాధ్యక్షులు మణికొండ వేద కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన అమరవాది నీరజ, పైడిమర్రి గిరిజలతో పాటు బాల సాహితీవేత్తలు శాంతి ప్రబోధ, దినవహి సత్యవతి, పుప్పాల కృష్ణమూర్తి, డాక్టర్ ఉప్పల పద్మ, డా. మండల స్వామి, జానకిరామ్ తదితరులు ఉన్నారు.

– డాక్టర్ ఉప్పల పద్మ
m : 9959126682

# రవీంద్రనాథ్ ఠాగూర్

భారత దేశానికి జాతీయ గీతాన్ని అందించిన కవి, రవీంద్రనాథ్ ఠాగూర్ లేదా రవీంద్రనాథ టాగూరు.

వంగ దేశంలో 1861 మే 7వ తేదీన దేవేంద్రనాథ ఠాగూర్, శారదాదేవీలకు పద్నాలుగవ సంతానంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జన్మించాడు. ఇతని బాల్యం చాలా చోద్యంగా గడిచింది. ఆముదం దీపం ముందు పుస్తకం పట్టుకొని కూర్చొని ఆవలిస్తూ కునికిపాట్లు పడుతూ చదివేవాడు. నిద్ర లేవగానే ఇంటి తోటలోకి పోయి ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందించేవాడు. కథలంటే చెవి కోసుకొనేవాడు. సామాన్య దుస్తులతో, నిరాడంబరంగా పెరిగాడు. బాల్యంలో ఇంట్లోనే నాలుగు గోడల మధ్య ఉండవలసి రావటంతో ఆయనకు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. ప్రపంచం యొక్క రహస్యమనీ, ఆ రహస్యాన్ని తెలుసుకోవాలనీ కుతూహలపడేవాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ రెండవ సోదరుడు సత్యేంద్రనాథ్ ఠాగూర్, మొట్ట మొదటి ఇండియన్ సివిల్ సర్వీస్‌లో నియమితుడైన మొదటి భారతీయుడు.



రవీంద్రుడు పాఠశాలలో చదవడానికి ఇష్టపడక ఇంటి వద్దనే క్రమశిక్షణతో ప్రతి ఉదయం వ్యాయామం చేసి, లెక్కలు చేసి, చరిత్ర, భూగోళ పాఠాలను, సాయంత్రం చిత్రలేఖనం, ఆటలు, ఇంగ్లీషు అభ్యసించే వాడు. ఆదివారాలలో సంగీత పాఠాలు, భౌతిక శాస్త్రం ప్రయోగాలు, సంస్కృత వ్యాకరణం నేర్చుకొనేవాడు. బొమ్మలున్న ఆంగ్ల నవలలను స్వయంగా చదివేవాడు. కాళిదాసు, షేక్స్‌పియర్ రచనలు చదివాడు. భాషను క్షుణ్ణంగా అభ్యసించి మాతృభాష పట్ల అభిమానం పెంచుకొన్నాడు.

రవీంద్రుడు ఇంగ్లాండులో ఒక పబ్లిక్ స్కూలులో చేరి, ప్రొఫెసర్ మార్లే ఉపన్యాసాలు విని ఆంగ్ల సాహిత్యంపై అభిరుచి పొంచుకొన్నాడు. సాహితీపరుల ప్రసంగాలు విని వారితో సంభాషించి నాటకాలకు, సంగీత కచేరీలకు వెళ్ళి, ఆంగ్ల సంస్కృతీ సంప్రదాయాలు బాగా ఆకళించుకొన్నాడు. తన అనుభవాలను భారతికి లేఖలుగా వ్రాసేవాడు. రవీంద్రుడు ఇంగ్లండులో వుండగానే భగ్న హృదయం అనే కావ్యాన్ని రచించాడు. అయితే ఇంగ్లండులో పద్దెనిమిది మాసాలు వుండి ఏ డిగ్రీనీ సంపాదించ కుండానే స్వదేశానికి తిరిగి వచ్చాడు.ఆ తర్వాత 1883 డిసెంబరు 9న మృణాలిని దేవీని వివాహమాడాడు.

రవీంద్రుడు బాల్యంలోనే అనేక పద్యాలు, వ్యాసాలు, విమర్శలు ప్రచురించాడు. ఆయన రచించిన సంధ్యాగీత్ కావ్యాన్ని కవులందరూ మెచ్చుకొనే వారు. వందేమాతరం గీతాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీ కూడా రవీంద్రుని ప్రశంసించాడు. రవీంద్రుడు రచించిన భక్తిగీతాలను తండ్రి విని, వాటి ప్రచురణకవసరమయిన డబ్బు ఇచ్చేవాడు. ఆ తరువాత రవీంద్రుడు విర్గరేర్ స్వప్న భంగ, సంగీత ప్రభాత అనే కావ్యాలను రచించాడు.

రవీంద్రుని రచనలలో గీతాంజలి చాల గొప్పది. రవీంద్రుడు తాను బెంగాలీ భాషలో రచించిన భక్తిగీతాలను కొన్నింటిని ఆంగ్లంలోనికి అనువదించి గీతాంజలి అని పేరు పెట్టాడు. అది అనేక ప్రపంచ భాషలలోనికి అనువదించబడింది. ప్రపంచ సాహిత్యంలో ఇది గొప్ప రచన. మానవుని కృంగదీసే నిరాశా నిస్పృహలను, సకల సృష్టిని ప్రేమభావంతో చూచి శ్రమ యొక్క గొప్పతనాన్ని సూచించే మహత్తర సందేశం.

గీతాంజలిలోని ముఖ్యాంశం. 1913వ సంవత్సరంలో సాహిత్యానికి సంబంధించి రవీంద్రుని గీతాంజలికే నోబెల్ బహుమతి లభించింది. విశ్వకవి అనే బిరుదును సాధించి పెట్టింది. ఆసియా ఖండంలో మొదటిసారి నోబెల్ బహుమతి పొందిన వ్యక్తి. గీతాంజలి వెలువడిన తరువాత అన్ని దేశాల వారు రవీంద్రుని గ్రంథాలను చదవడం ఆరంభించారు.



రవీంద్రుడు కేవలం రచయితగానే ఉండిపోక, బాలల హృదయాలను వికసింప చేయటానికై ప్రాచీన ఋషుల గురుకులాల తరహాలోనే శాంతినికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. అది అయిదుగురు విద్యార్థులతో మొదలై, క్రమంగా విస్తరించింది. చిన్న పిల్లలు ఉపాధ్యాయుల ఇళ్ళల్లో భోజనం చేసేవారు. ప్రాతఃకాలానే నిద్ర లేవడం, కాలకృత్యాలు తీర్చుకొని, తమ గదులను తామే శుభ్రపరచుకొని స్నానం చేయడం, ప్రార్థన చేయటం, నియమిత వేళలలో నిద్ర పోవటం వారి దినచర్య. ఆరోగ్యం కాపాడుకోవటం, పరిశుభ్రత, సత్యాన్నే పలకడం, కాలినడక, పెద్దలను, గురువులను గౌరవించటం వారికి నేర్పేవారు. 1919లో కళా భవన్‌ను ఆయన స్థాపించాడు. ఇక్కడ విద్యార్థులు విభిన్న కళలను నేర్చుకునేవారు.

గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని రవీంద్రుడు భావించాడు. అందుకై శ్రీనికేతాన్ని నెలకొల్పి, గ్రామ పునర్నిర్మాణానికి ఎంతో కృషి చేసేవాడు. రవీంద్రుడు మొదట వాల్మీకి ప్రతిభ అనే నాటకాన్ని రచించాడు. ఆ తరువాత అమల్ అనే పిల్లవాణ్ణి గురించి పోస్టాఫీసు అనే నాటకం వ్రాశాడు. రవీంద్రుడు రచించిన చిత్రాంగద నాటకం ఆయనకు మంచి పేరు తెచ్చింది. ప్రకృతి - ప్రతీక అనే నాటకంలో ప్రపంచాన్ని విడిచి పెట్టిన సన్యాసి కథను వర్ణించాడు. రవీంద్రుడు కచదేవయాని, విసర్జన, శరదోత్సవ్, ముక్తధార, నటిర్‌పూజ మొదలగు అనేక శ్రేష్ఠమయిన నాటకాలు రచించాడు. మతాలు వేరైనా పరస్పర స్నేహంతో కలసి మెలసి ఉండాలి అనే సాంఘిక ప్రయోజనం, ఉత్తమ సందేశం మిళితమైన "గోరా" నవల రవీంద్రునికెంతో పేరు తెచ్చింది.

రవీంద్రనాథ్ ఠాగూర్ డెబ్బై ఏళ్ళ ప్రాయంలో చిత్రకళా సాధనను ప్రారంభించాడు. ఆయన వేసిన చిత్రాలు లండను, ప్యారిస్, న్యూయార్కు మొదలగు నగరాలలో ప్రదర్శించబడ్డాయి. ఆయన దాదాపు రెండు వేల చిత్రాలను గీశాడు.

రవీంద్రుడికి సంగీతమంటే మిక్కిలి ప్రీతి. ఆయన బెంగాల్ జానపద గీతాలను, బావుల్ కీర్తనలను విని ముగ్ధుడయ్యేవాడు. ఆయన స్వయంగా గాయకుడు. భారతీయ సంగీతంలో రవీంద్ర సంగీతం అనే ప్రత్యేక శాఖను ఏర్పరచిన వాడు రవీంద్రుడు.

– సువేగా

CENTRAL BOOKS
SINCE 1947

Your trusted Academic Partner - Then, Now & Forever

DIAMOND JUBILEE
CELEBRATING 75 YEARS OF KNOWLEDGE, TRUST & LEADERSHIP



12 lakhs + Customers | 700+ Schools | 15 Business Awards | Online Services | Digital Learning | Books and Stationery Supplies

**Head Office :** 6-3-553,C1, Quena Square, Erramanzil, Somajiguda, Hyderabad. Tel: 040-24098282

Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.

Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.

www.centralbooks.in

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication - 25th April, 2024

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com